ప్రజాశక్తి
సోమవారం 21 ఆగస్టు 2023 8 పేజీలు
గుంటూరు పల్నాడు

ఎవరికీ పట్టని పౌడ



- వెంచర్లకు నోటీసులకే పరిమితం
- తాత్కాలిక ఉద్యోగులతో కాలక్షేపం
- అభివృద్ధి పథకాలకు నిధులనివ్వని ప్రభుత్వం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

పల్నాడు పట్టణాభివృద్ధి సంస్థ (పౌడ)కు ఇంత వరకు సౌకర్యాలేమీ ఏర్పాటు కాలేదు. ఈ సంస్థ ఏర్పాటు చేస్తూ గతేడాది డిసెంబరు 13న ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆ తరువాత జనవరిలో పౌడ చైర్మన్‌గా నర్సరావుపేటకు చెందిన మిట్టపల్లి రమేష్‌బాబును నియమించారు. ఆయన బాధ్యతలు స్వీకరించిన మూడునెలలకు సంస్థ వైస్ చైర్మన్‌గా జి.శ్రీనివాసరెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీనివాసరెడ్డి పశుసంవర్ధక శాఖలో అసిస్టెంట్ డైరెక్టరుగా పనిచేస్తూ పల్నాడు జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేల సిఫార్సుతో డిప్యూటేషన్‌పై వైస్ చైర్మన్‌గా నియమితులయ్యారు.

పల్నాడు జిల్లా మొత్తాన్ని ఒకే పట్టణాభివృద్ధి సంస్థగా ఏర్పాటు చేస్తూ గతేడాది డిసెంబరులో ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం ఇందుకు సంబంధించి తగిన విధివిధానాలు జారీ, మౌలికసదుపాయల కల్పనపై దృష్టి సారించలేదు. ప్రజలకు కల్పించాల్సిన అభివృద్ధి పనులకు నిధులు కేటాయింపులేదు. పల్నాడు పట్టణాభివృద్ధి సంస్థ (పౌడ) కార్యాలయానికి భవనం లేదు. దీంతోఒక ప్రైవేటు భవనంలో కార్యాలయం ఏర్పాటు చేశారు. జి.శ్రీనివాసరెడ్డిని వైస్ చైర్మన్‌గా నియమించినా మేనేజింగ్ డైరెక్టర్ హోదాను కల్పించలేదు. మరోవైపు 'పౌడ'కు సిబ్బందిని కేటాయించకపోవడంతో పలు మున్సిపాల్టీల నుండి కొంతమంది సిబ్బందిని డిప్యూటేషన్‌పై కేటాయించారు.

ప్రస్తుతం 'పౌడ' పరిధిలోకి వచ్చే గ్రామాల్లోని భూములు, వెంచర్లు, అనుమతుల వివరాలు సేకరిస్తున్నారు. నిర్మాణాలకు, వెంచర్లకు 'పౌడ' అనుమతి తీసుకోవాలని వైస్‌చైర్మన్ హోదాలో శ్రీనివాసరెడ్డి నోటీసులు జారీ చేస్తున్నారు. పల్నాడు జిల్లాలో వివిధ ప్రాంతాల్లో అనధికారిక వెంచర్లు జోరుగా వెలుస్తున్నాయి. వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములు మారుస్తున్నారు. ఇందుకు సంబంధించి పౌడ నుంచి అనుమతి తీసుకోవడం లేదు. ఈ సంస్థకు సర్వేయర్లు, ఇతర సిబ్బంది లేకపోవడం వల్ల వెంచర్లలో నిబంధనల అమలుకు సాధ్యం కావడం లేదు. నిబంధనలను పట్టించుకోకుండా వెంచర్లు వేస్తున్నా రెవెన్యూ, గ్రామ పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ అధికారులు కూడా చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారు. వెంచర్లకు అనుమతి ఇవ్వాల్సిన పల్నాడు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(పౌడ)

2లో

శంకుస్థాపన చేస్తున్న కలెక్టర్, ఉమ్మారెడ్డి, రోశయ్య తదితరులు

కొమ్మమూరు కాల్వపై రూ.42.75 కోట్లతో బ్రిడ్జి

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు - చీరాల రోడ్డులో కొమ్మమూరు కాల్వ (మద్రాసు కాల్వ) మీద రూ.42.75 కోట్ల అంచనా విలువతో హైలెవెల్ బ్రిడ్జ్ నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యేలు కిలారు వెంకట రోశయ్య, మహమ్మద్ ముస్తఫా, మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో పొన్నూరు ఎమ్మెల్యే కిలారు రోశయ్య మాట్లాడుతూ వందేళ్లకుపైగా చరిత్ర కలిగిన చేబ్రోలు,

హైలెవల్ బ్రిడ్జ్ నిర్మాణానికి శంకుస్థాపన

కొమ్మమూరు-మద్రాసు కాల్వ బ్రిడ్జ్‌పై నూతనంగా నిర్మించబోతున్న హైలెవెల్ బ్రిడ్జ్‌కి శంకుస్థాపన సంతోషంగా వుందన్నారు. ఈ బ్రిడ్జ్ నిర్మాణం వల్ల బాపట్ల, రేపల్లె వైపు వెళ్లే ప్రయాణం చాలా సులువుగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సమర్పణరావు, డిఇ నాగేశ్వరరావు, ఏఈ రాంబాబు, వైసిపి నియోజకవర్గ పరిశీలకులు ఎ.సదాశివరావు, జి.అంజిరెడ్డి, జెడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

49 మంది వికలాంగులకు త్వరలో ఉద్యోగాలు

- నియోజకవర్గానికి 10 మందికి ద్విచక్ర వాహనాలు
- వృద్ధులకు గుర్తింపు కార్డులు
- ట్రాన్స్‌జెండర్లకు చేతివృత్తులపై నైపుణ్య శిక్షణ
- ఉమ్మడి గుంటూరు జిల్లా సహాయ సంచాలకులు సువార్త

8లో

ప్రజలకు సైన్స్ ఫలాలను అందించడమే లక్ష్యం

- ఇప్పటికీ రాజ్యమేలుతున్న అశాస్త్రీయ భావజాలం
- శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంచేందుకు జెవివి కృషి
- పల్నాడు జిల్లా మహాసభలో నాయకులు - నూతన కమిటీ ఎన్నిక

8లో

ర్యాలీకి హాజరైన అభ్యర్థులు.. పరిశీలిస్తున్న పల్నాడు కలెక్టర్ ఎల్.శివశంకర్ (ఇన్‌సెట్)

ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ ప్రారంభం

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

అగ్నిపథ్ కింద చేపట్టిన ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీని పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలోని జిల్లా క్రీడా ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదివారం తెల్లవారుజామున ప్రారంభించారు. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ ట్రేడ్స్‌మన్ (10వ తరగతి), అగ్నివీర్ ట్రేడ్స్‌మన్ (8వ తరగతి), అగ్నివీర్ క్లర్క్/స్టోర్ కీపర్ టెక్నికల్ విభాగాలో అభ్యర్థుల భర్తీకి కామన్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (సిఇఇ) ద్వారా షార్ట్‌లిస్ట్ చేసిన 5 వేల మంది వరకు అభ్యర్థులు ర్యాలీకి హాజరుకానున్నారు. వీరిలో గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నంద్యాల, కర్నూలు, అనంతపురం, వైఎస్ఆర్ కడప, తిరుపతి, అన్నమయ్య, చిత్తూరు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, శ్రీ సత్యసాయి జిల్లాల వారున్నారు.

వైసిపి అభ్యర్థులను పోటీలో పెట్టలేదు : ఎంపిపి

మాట్లాడుతున్న ఎంపిపి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

మండలంలోని హాఫ్‌పేట, బుర్రిపాలెంలో ఇండిపెండెంట్ అభ్యర్థులుగా ఉపఎన్నికల్లో ఓడిపోయిన వారిని వైసిపికి చెందినవారంటూ కొన్ని పత్రికల్లో రాస్తున్నారని, ఇది సరికాదని మండల పరిషత్ అధ్యక్షులు సిహెచ్.శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు తన కార్యాల యంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో జరిగిన ఉప ఎన్నికల ఫలితాల్లో వైసిపిపై టిడిపి క్లీన్‌స్వీప్ చేసిందన్న కథనాలు రాస్తున్నారని, దీనివల్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఒరిగేదేమీ లేదని అన్నారు. గత ఎన్నికల్లో గెలుపొంది మృతి చెందిన వారి కుటుంబాల్లో వ్యక్తులకు స్థానం కల్పించాలనే ఉద్దేశంతోనే వైసిపికి చెందినవారిని పోటీకి దింపలేదన్నారు. ఎమ్మెల్యే శివకుమార్‌పై బురదచల్లడం మానుకోవాలని, రానున్న ఎన్నికల్లో వైసిపి సత్తా చూపుతామని అన్నారు.

సుధాకర్ గౌడ్‌కు పరామర్శ

ప్రజాశక్తి - మంగళగిరి

టిడిపి బిసిసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, గీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి రేఖ సుధాకర్ గౌడ్ ఇటీవల సర్జరీ చేయించుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయన్ను మంగళగిరిలో ఆయన నివాసంలో టిడిపి బీసీ సెల్ నాయకులు ఆదివారం పరామర్శించారు. వీరిలో బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి డి.సుందర్రావు యాదవ్, స్థానిక నాయకులు వి.మాధవరావు, కె.అప్పారావు, సిహెచ్ పూర్ణచంద్రరావు ఉన్నారు.

అలరించిన సంగీత విభావరి

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

బ్రాడీపేటలోని నాగార్జున సాంస్కృతి కేంద్ర నాగార్జున మ్యూజిక్ కాలేజ్ ఆధ్వర్యంలో స్థానిక బృందావన్‌గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై ఆదివారం సంపత్ కుమార్ 'శ్రీకష్ణ తరంగాలు' సంగీత కార్యక్రమం జరిగింది. తొలత ఆలయ కమిటీ అధ్యక్షులు సిహెచ్ మస్తానయ్య జ్యోతి ప్రజ్వల్వన చేశారు. నాగార్జున మ్యూజికల్ అధ్యక్షులు డాక్టర్ ఎన్.సత్యనారాయణ, నాగార్జున మ్యూజికల్ సెక్రటరీ డాక్టర్ ఎం.శ్రీధర్ ప్రసంగించారు. మృదంగం రామకృష్ణ, వాయిలెన్ చావల శ్రీనివాస్‌తో చేసిన సంగీతవిభావరి అలరించింది. కార్యక్రమాన్ని నాగార్జున మ్యూజిక్ కాలేజ్, కల్చర్ సెంటర్ జనరల్ సెక్రటరీ డాక్టర్ కె.సూర్యనారాయణ పర్యవేక్షించారు.

రేపు 'నవ్వు-నవ్వించు' హాస్యవల్లరి

ప్రజాశక్తి - గుంటూరు

అవగాహన సంస్థ ఆధ్వర్యంలో ప్రతినెలా హాస్యప్రియుల కోసం నిర్వహిస్తున్న 'నవ్వు - నవ్వించు' అనే హాస్యవల్లరి కార్యక్రమాన్ని మంగళవారం సాయంత్రం 6 గంటలకు అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో నిర్వహిస్తామని సంస్థ కార్యదర్శి కె.శివరామిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ మానసిక వైద్యులు డాక్టర్ కె.సురేష్‌కుమార్ పాల్గొని మానసిక ఒత్తిడి నివారణలో నవ్వు పాత్రపై వివరిస్తారని పేర్కొన్నారు. హాస్య రచయిత డాక్టర్ బివి రామ్‌కుమార్, విశ్రాంత హెచ్‌ఎం ఆరె వెంకటేశ్వర్లు హాస్యయుత ప్రసంగాలు చేస్తారని తెలిపారు.

మహిళా రెసిడెంట్ వైద్యుల సమస్యలపై సూపరింటెండెంట్ దృష్టి

భద్రత, పారిశుధ్య నిర్వహణ సిబ్బంది నియామకానికి, ఇతర సమస్యల పరిష్కారానికి ఆదేశం - పర్యవేక్షణాధికారి నియామకం

మహిళా రెసిడెంట్ వైద్యులతో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)లో మహిళా సీనియర్ రెసిడెంట్స్ వసతి గృహాన్ని సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్ ఆదివారం పరిశీలించారు. హాస్టల్‌కు రెండేళ్ల నుంచి మహిళా పర్యవేక్షణ అధికారి లేరని, ప్రైవేటు వ్యక్తులే పర్యవేక్షిస్తుడడంతో సమస్యలను ఎవరికి చెప్పాలో అర్థం కావడం లేదని రెసిడెంట్ వైద్యులు అన్నారు. ఐదంస్తుల భవనంలో 40 రూములు ఉన్నాయని, ఒక్కో గదికి ముగ్గురు చొప్పున 120 మంది ఉన్నామని తెలిపారు. మందులను భద్రపర్చడానికి ఇక్కడ గదిని కేటాయించగా వాటి కోసం పురుషులూ వస్తుంటారని, ఆ సందర్భంలో తకు ఇబ్బందిగా ఉంటుందని వివరించారు. మందులను మరోచోటుకు తరలించాలని కోరారు. రాత్రివేళల్లో విధులకు వెళ్లి వచ్చే క్రమంలో పోకిరీలు సంచరిస్తుండడం వల్ల భయంగా ఉందన్నారు. సూపరింటెండెంట్ మాట్లాడుతూ హాస్టల్ వద్ద పగలు ఒకర్ని, రాత్రివేళల్లో ఒక మహిళ, ఒక పురుష సెక్యూరిటీని నియమించాలని ఆదేశించారు. ఫ్లోర్‌కు ఒకరు చొప్పున పారిశుధ్య కార్మికుల్ని నియమించాలన్నారు. హాస్టల్ పర్యవేక్షణాధికారిగా అనాటమి విభాగం హెచ్‌ఒడి డాక్టర్ సావిత్రిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశామన్నారు. మహిళా రెసిడెంట్లకు పీజీ విద్యార్థుల హాస్టల్ నుండి భోజనం తేవడాన్ని తప్పుబట్టారు. జనరేటర్‌కు మరమ్మతు చేయించాలని, గదులకు ఏసీలు పెట్టుకోవడానికి ఉన్న అవకాశాన్ని పరిశీలించాలని ఆదేశించారు. ఆయనవెంట సివిల్ సర్జన్ ఆర్‌ఎంఒ డాక్టర్ సతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశా సజని ఉన్నారు.

మాట్లాడుతున్న తెనాలి శ్రావణ్‌కుమర్, కోవెలమూడి రవీంద్ర, దేగల ప్రభాకర్ తదితరులు

ప్రభుత్వ వ్యతిరేక ప్రభావంతో యువగళం విజయవంతం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రభుత్వ వ్యతిరేక ప్రభావం ఎక్కువగా ఉండటం వల్లే టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర విజయవంతంగా సాగిందని టిడిపి గుంటూరు జిల్లా అధ్యక్షులు తెనాలి శ్రావణ్ కుమార్ అన్నారు. ఆదివారం ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడారు. పల్నాడు, గుంటూరు జిల్లాల్లో యువగళం పాదయాత్ర లక్షలాది మంది శ్రేణులతో విజయవంతంగా నిర్వహించారన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలు అనే తేడా లేకుండా యువత, సామాన్య ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారని అన్నారు. సామాన్యులు, పారిశ్రామిక, రైతులు, కార్మికు, అమరావతి భూములిచ్చిన రైతులను, పేద బడుగు బలహీన వర్గాలను కలసి సమస్యలు తెలుసుకుంటూ లోకేష్ పాదయాత్ర జరిగిందన్నారు. అన్ని వర్గాల ప్రజలు వైసిపి ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను పాదయాత్ర ద్వారా చూపారన్నారు. వైసిపిలో నిరాదరణకు గురైన కార్యకర్తలు, ఎమ్మెల్యేలు కూడా వచ్చి లోకేష్ పాదయాత్రలో కలవడం చూస్తే వైసిపి ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత బయటపడిందన్నారు. టిడిపి గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోవెలమూడి రవీంద్ర మాట్లాడుతూ యువగళం పాదయాత్రకు ప్రజలతో పాటు మీడియా సోదరులు చూపిన పాత్ర ప్రత్యేకమైందన్నారు. గుంటూరు నగర పార్టీ అధ్యక్షుడు దేగల ప్రభాకర్ మాట్లాడుతూ లోకేష్ యువగళం పాదయాత్ర ప్రభంజనం సృష్టించి వైసిపి నాయకుల గుండెల్లో రైళ్లు పరుగెత్తించిందన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు కె.శివరామయ్య, జి.శేషగిరిరావు, డి.శ్రీనివాసరావు, ఆర్.సాయికష్ణ, నాయుడు ఓంకార్, జి.దయారత్నం పాల్గొన్నారు.

విద్యా వ్యతిరేక విధానాలను తిప్పికొడదాం

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ (విజయవాడ)

ప్రభుత్వాలు అవలంభిస్తోన్న విద్యా వ్యతిరేక విధానాలను విద్యార్థులు ఐక్యంగా తిప్పికొట్టాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్ పిలుపునిచ్చారు. విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా ప్లీనరీ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యా రంగాన్ని నిర్వీర్యం చేస్తోందన్నారు. అధికారంలోకి రాకముందు జగన్మోహన్‌రెడ్డి అనేక హామీలు విద్యార్థులకు ప్రకటించారని, నాలుగేళ్లు అయినా నేటికీ విద్యార్థుల సమస్యలు పరిష్కారం కాలేదని విమర్శించారు. రాష్ట్రంలో అర్హులైన పీజీ విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన ఎందుకు వర్తింపజేయడంలేదని ప్రశ్నించారు. వీటితో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సరైన సదుపాయాలు లేక అనేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని అనేక ప్రాంతాల్లో ఎస్ఎఫ్ఐ ఆందోళన కార్యక్రమాలు, సైకిల్ యాత్రలు నిర్వహిస్తున్నట్లు చెపాపరు. ప్రభుత్వం ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని విద్యారంగంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రసన్నకుమార్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎన్.నాగేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్, ఐలు రాష్ట్ర కమిటీ సభ్యులు ఆవుల వెంకట్రావు మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ నిరంతరం విద్యార్థుల సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. విద్యార్థులు ఐక్యంగా ఉండి తమ హక్కుల్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.సోమేశ్వరరావు, జిల్లా కార్యదర్శి సిహెచ్ వెంకటేశ్వరావు, జిల్లా అధ్యక్షుడు జి.గోపినాయక్, మాజీ ఎస్ఎఫ్ఐ నాయకులు టి.ప్రవీణ్, ఎన్టీఆర్ జిల్లా సహాయ కార్యదర్శి కే.రాజు, జిల్లా ఉపాధ్యక్షురాలు ఎస్.కె.జాహిదా, విజయవాడ నగర కార్యదర్శి మన్మధ, నగర అధ్యక్షుడు కుమారస్వామి, భార్గవ్, రాజ్ కుమార్, నాయకులు ఎం.పునీత్ వర్మ, కె.పథ్వి, ఆనంద్,సంతోష్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

117 జిఒ రద్దుచేయాలి : ఎమ్మెల్సీ కెఎస్

ప్రజాశక్తి - తిరువూరు : జిఒ 117 రద్దు పరచి ప్రభుత్వ పాఠశాలను పరిరక్షణ చేయాలని ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు డిమాండ్ చేశారు. యుటిఎఫ్ ఎన్టీఆర్ జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశం తిరువూరు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగింది. లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యారంగానికి పెద్దఎత్తున ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్తున్న ప్రభుత్వం గత 5 సంవత్సరాలుగా ఒక్క డిఎస్‌సి కూడా నియామకం జరపకపోగా జిఒ 117 తెచ్చి ఉపాధ్యాయలపై పెద్ద ఎత్తున పనిభారం మోపారని ఆరోపించారు. ఈ జిఒను రద్దు పర్చాలని అయన డిమాండ్ చేశారు.

ఎవరికీ పట్టని పాడ

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహణకు ఇంకా నిర్థిష్టంగా ఆదేశాలు రాకపోవడం వల్ల ఎవ్వరూ నియంత్రించడం లేదు. ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం రావడం లేదు. కాల్వ గట్లను సైతం ఆక్రమించి రోడ్లు వేస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు రియల్టర్లు కనీస నిబంధనలు పాటించడం లేదని, రాజకీయ పలుకుబడితో వ్యవసాయ భూముల్లో ప్లాట్ వేసి విక్రయాలు చేస్తున్నట్టు తెలిసింది.

భూ మార్పిడికి పంచాయతీ, మున్సిపాల్టీ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. మొత్తం భూమి విలువలో ఐదు శాతం ఫీజును స్థానిక సంస్థలకు చెల్లించాలి. మొత్తం భూమిలో 10 శాతం కమ్యూనిటీ స్థలాలుగా వదిలిపెట్టాలి. ఇందుకు సంబంధించి పౌడకు ఉన్న అధికారాలు, నియంత్రణ, నిబంధనలు పాటించే అంశాలపై ప్రభుత్వం ఇంత వరకు మార్గదర్శకాలు విడుదల చేయలేదు. మున్సిపల్ పరిపాలన శాఖ ఉన్నతాధికారులు కూడా ఎనిమిది నెలలుగా ఒక్కసారిగా పౌడ కార్యాలయాన్ని సందర్శించిన దాఖలాలులేవు. కేవలం రాజకీయ ఉపాధి కోసం వైసిపి నాయకులు మిట్టపల్లి రమేష్‌బాబుకు చైర్మన్ హోదా ఇచ్చేందుకు ఈ సంస్థను ఏర్పాటు చేయించారు. మాతృశాఖలో పనిచేయడం ఇష్టం లేక డిప్యూటేషన్‌పై వైస్ చైర్మన్ హోదాను తెచ్చుకున్న శ్రీనివాసరెడ్డి కోసం ఈ సంస్థ ఏర్పాటు అయినట్టు ఉందనే ఆరోపణలూ వస్తున్నాయి. ఈ సంస్థ ద్వారా పల్నాడులో ఇంతవరకు జరిగిన అభివృద్ధి పనులు అంటూ ఏమీ లేవు. పౌడాపరిధిలో మౌలిక సదుపాయాల కల్పన బాధ్యతలపై ఎవరికీ పట్టడం లేదు.

బాధిత కుటుంబానికి నిత్యావసరాలు అందిస్తున్న తహాశీల్దార్

ద్వారకా నగర్‌లో పూరిల్లు దగ్ధం

నిరాశ్రుయులైన గొర్రెల కాపరి కుటుంబానికిసాయం

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి ద్వారకానగర్ లోని నల్లగొర్ల పిచ్చయ్యకు చెందిన పురిల్లు ప్రమాదపు శాత్తు అగ్ని ప్రమాదం జరిగి పూర్తిగా దగ్ధమై కుటుంబం నిరాశ్రు లయ్యారు. శనివారం రాత్రి పొయ్యి మీద వంట చేసుకునే సమయంలో పొయ్యిలోని నిప్పురవ్వలు ఇంటికి అంటుకొని ప్రమాదవ శాత్తు ఇల్లు దగ్ధమైంది. పిచ్చయ్య గొర్రెల కాపరిగా జీతంకు పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటాడు. అగ్ని ప్రమాదంతో ఇంటితోపాటు సామాగ్రి, వస్త్రాలు అన్ని దగ్ధం అవడంతో నిరాశ్ర యులయ్యారు. సుమారు మూడు లక్షల రూపాయలు వరకు ఆస్తి నష్టం జరిగింది. ఈ మేరకు సమాచారం తెలుసుకున్న తహాశీల్దారు జీ వీ రామప్రసాద్ ఆదివారం దగ్ధమైన నివాస గృహాన్ని పరిశీలించి, బాధిత కుటుంబానికి బియ్యం, నిత్యవసర సరుకులు అందజేశారు. అనంతరం తహాశీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ సహాయం అందజేయటానికి కలెక్టర్ దృష్టికి, ఇంటి నిర్మాణం కోసం గృహ నిర్మాణ శాఖ అధికారుల దష్టికి తీసుకువెళ్లినట్లు చెప్పారు. బాధిత కుటుంబానికి గృహ నిర్మాణ శాఖ అధికారులు, ఇంటి నిర్మాణానికి సుముఖత వ్యక్తం చేశా రన్నారు. ఆర్ఐ సాంబశివరావు, వీఆర్వో రాజ్యలక్ష్మి, యదుల్లా పాల్గొన్నారు.

డబ్బు విషయమై అన్నదమ్ముల ఘర్షణ

ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-నాదెండ్ల

మండలంలోని చందవరం గ్రామంలో అన్న దమ్ములు డబ్బులు విషయంలో ఇద్దరు గొడవపడి సం ఘటన ఆదివారం చోటుచేసుకుంది. నాదెండ్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చందవరం గ్రామానికి చెందిన శ్రీనివాస్ రెడ్డి, అతని అన్నయ్య గొంతు జై భారతి రెడ్డికి డబ్బులు విషయంలో గొడవైంది. గొడ్డలితో ఇరు వురు పరస్పరం దాడి చేసుకోవడంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. నరసరావుపేటలో ప్రైవేట్ వైద్య శాలలో వారిని చికిత్స నిమిత్తం చేర్పించారు. విచారణ చేపట్టినట్టు నాదెండ్ల ఎస్సై బలరామిరెడ్డి తెలిపారు. కాగా,శ్రీనివాస్ రెడ్డి వైసిపి మండల పార్టీ నాయకుడిగా చలామణిలో ఉన్నాడు. మంత్రి విడదల రజినితో విభే దాల కారణంతో తన వర్గం ఏర్పాటు చేసుకున్నాడు . మంత్రి కార్యక్రమాలకు ఆయన దూరంగా ఉన్నారు .

బాలికకు మాయమాటలు చెప్పి అత్యాచారం

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

మైనర్ బాలికతో పరిచయం పెంచుకొని ఆపై ఆమెపై అఘాయిత్యం చేయడంతో గర్భవతి అయిన సంఘటన ప్రత్తిపాడు మండలం లోని గొట్టిపాడులో చోటు చేసుకుంది. ప్రత్తిపాడు ఎస్ ఐ రవీంద్రబాబు తెలిపిన వివరాల ప్రకారం పల్నాడు జిల్లా, నరసరావుపేట మండలం దొండ పాడుకి చెందిన ఒక కుటుంబం సుమారు పదేళ్ల క్రితం గొట్టిపాడుకి కూలి పనుల నిమిత్తం వలస వచ్చి అక్కడే నివాసం ఉంటోంది. వారికి ముగ్గురు ఆడపిల్లలు. పద్నాలుగేళ్ల వయసు గల వారి పెద్ద కుమార్తె కొన్ని నెలల క్రితం గొట్టిపాడులోని జెడ్‌పి హై స్కూల్ లో 7 వ తరగతి చదువుతుండగా అదే గ్రామానికి చెందిన 27 ఏళ్ల రాజుపాలెం రామకృష్ణ ప్రతిరోజూ క్రికెట్ ఆడేందుకు ఆ పాఠశాల మైదానంలోకి వచ్చేవాడు. ఈ క్రమంలో బాలిక తో పరిచయం పెంచుకొని ఆమెకు మాయ మాటలు చెప్పి గ్రామ శివారులోని రేగి తోటలోకి తీసుకు వెళ్లి ఆమెపై అఘాయిత్యా నికి పాల్పడ్డాడు. ఆ తర్వాత ఆ బాలిక తండ్రి చని పోవడంతో వారు తిరిగి వారి స్వగ్రామం దొండ పాడుకి వెళ్లి పోయారు. రామకృష్ణ ఆ గ్రామా నికి కూడా వెళు తుండేవాడు. ప్రస్తుతం ఆ బాలిక గర్భవతి అని సదరు బాలిక తనంతట తానుగా ఇచ్చిన రిపోర్టు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి

ప్రజాశక్తి -పల్నాడు జిల్లా

ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరిం చేందుకే ప్రభుత్వం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి పిలుపునివ్వడం జరిగిందని, ఈ కార్యక్రమం 99 శాతం పూర్తి చేశామని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నరసరావుపేట పట్టణంలోని 11వ వార్డు రెండవ రోజు ఆదివారం రిక్షా సెంటర్ వద్ద నుండి చేపట్టిన గడపగడపకు కార్యక్రమంలో భాగంగా విచ్చేసిన ఎమ్మెల్యేకి స్థానికులు ఘనంగా స్వాగతం పలి కారు. స్థానిక పార్టీ నేతలతో కలిసి దివంగత ముఖ్యమంత్రి వైయస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. మాజీ కౌన్సిలర్ ఏలూరు సుబ్బారెడ్డి,వార్డ్ ఇంచార్జ్ సానికొమ్ము రమణారెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డి

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించామన్నారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చినట్లు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథ కాలను ప్రజలకు వివరించడంతో పాటు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నామని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చా మన్నారు. అర్హత ఉండి పథకాలు అందని లబ్ధి దారులకు వెంటనే ఆ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పార్టీలకు అతీతంగా ప్రతీ పథకం అర్హులైన లబ్ధి దారులకు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం. రాంమోహన్ రావు, , సిబ్బంది ఎలక్ట్రికల్ ఏడిఈ, ఏఈ, హౌసింగ్ ఏఈ, సచివాలయ సిబ్బంది, వైసిపి నాయకులు, కార్యకర్తలు వివిధ శాఖల కార్పొరేషన్ చైర్మన్లు మరియు డైరెక్టర్లు, వార్డు ఇన్చార్జిలు, వార్డు మెంబర్లు, సచివాలయ కన్వీనర్లు, మహిళా అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

భార్య కనిపించడం లేదని ఫిర్యాదు

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

బార్య కనిపించడం లేదని బర్త పిర్యాదు చేసి సంగటణ ప్రత్తిపాడు మండలం లోని చిన్న కొండ్రపాడు లో చోటు చేసుకుంది. ప్రత్తిపాడు ఎస్ఐ రవీంద్రబాబు తెలిపిన వివరాల ప్రకా రం కృష్ణా జిల్లా, మచిలీపట్నం మండలం, మల్లువాయి గ్రామానికి చెందిన పుల్లా మురళికి పదహారేళ్ల క్రితం సూర్యాపేటకి చెందిన సుజాతతో వివాహం జరిగింది. ప్రస్తుతం ఆమె వయస్సు 33 సంవత్సరాలు. వారికి ఒక పాప, ఒక బాబు సంతానం . రెండేళ్ల క్రితం వారిద్దరూ పిల్లలతో సహా కూలి పనుల నిమిత్తం ప్రత్తిపాడు మండలం, చినకొండ్రుపాడు గ్రామానికి వలస వచ్చి వెంకట రాజేష్, కోళ్ళ ఫారంలో పని చేసేవాడు. కంపెని క్వార్టర్స్ లో నివాసం ఉండేవాడు. ఈ నెల 5 వ తేదీ ఉదయం సుజాత ఎవరితోనో ఫోన్ లో మాట్లాడుతోందని గమనించిన భర్త ఆమెని మంద లించాడు. ఆ తరువాత ఉదయం 6 గంటలకి సుజాత ఎవరికీ చెప్పకుండా ఎక్కడికో వెళ్లిపోయింది. ఆ రోజు నుండి అదే కోళ్ళ ఫారం లో పని చేసే ఒరిస్సా కి చెందిన వరుణ్ తండి అనే అతను కూడా కనిపించకుండా పోయాడు. అతని ఫోన్ స్విచ్ ఆఫ్ లో ఉంది.అతనే సుజాతని తీసుకొని వెళ్లి ఉండవచ్చనే అనుమానంతో మురళి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పేకాట రాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

పేకాట ఆడుతున్న ఎనిమిది మంది జూదరులను అరెస్టు చేసి వారివద్ద నుండి రూ.5,500 నగదును స్వాధీ నం చేసుకున్నట్లు సత్తెనపల్లి రూరల్ ఇన్చార్జి ఎస్ఐ షేక్ అమీనూద్దీన్ ఆదివారం తెలిపారు. సత్తెనపల్లి మండలం పెదమక్కెనలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు పేకాట స్థావరంపై పోలీస్ సిబ్బందితో దాడిచేసిన జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

రాజీవ్ గాంధీకి కాంగ్రెస్ నాయకుల నివాళి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

దేశాన్ని శాస్త్ర సాంకేతికరంగాల్లో అభివృద్ధి చేసేం దుకు మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ తీవ్రంగా కృషి చేశారని పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వలి అన్నారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో రాజీవ్ గాంధీ 79వ జయంతి వేడుకలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు లింగం శెట్టి ఈశ్వర రావు, నగర అధ్యక్షులు షేక్ ఉస్మాన్ అధ్వర్యంలో జయంతి కార్యక్రమం జరిగింది . ముఖ్య అతిథిగా పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వలీ హాజరు అయ్యారు. రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసిపలువురునివాళి అర్పించారు. ఈశ్వర రావు, ఉస్మాన్ మాట్లాడారు.

రాజీవ్‌గాంధీకి జమీల్ అహ్మద్ బేగ్ నివాళి

భారతదేశంలో అతి చిన్న వయసులో యువ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన రాజీవ్‌గాంధీ బహుశా ప్రపంచంలోనే అతి పిన్న వయస్కుల్కెన ప్రభుత్వాది నేతల్లో ఒకరని నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం నేషనల్ వైస్ ఛైర్మన్ జమీల్ అహ్మద్ బేగ్ అన్నారు. గుంటూరు లాలాపేటలోని పెద్ద మసీదు దగ్గర మహ బూబ్ సుభానీ జెండా చెట్టు వద్ద ఆదివారం రాజీవ్‌గాంధీ జయంతి వేడుకల సందర్భంగా రాజీవ్ చిత్రపటానికి బేగ్ పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు.

పోలీసులు.. టిడిపి కార్యకర్తలను కొట్టడం దుర్మార్గం

టిడిపి మాచర్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి

ప్రజాశక్తి-విజయపురిసౌత్

విజయపురిసౌత్ పోలీస్ స్టేషన్ లో టిడిపి గిరిజన కార్యకర్త రామచంద్ ను పోలీసులు అకారణంగా కొట్టడం దుర్మార్గమని మాచర్ల నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. విజయపురిసౌత్ లోని దేశవరపు క్యాంపు తండా లో బాధితుడు రామచంద్ ఇంటికి ఆదివారం ఆయన వెళ్లి పరామర్శించారు.అనంతరం బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ రాష్టంలో దుర్మార్గపు వైసీపీ పరిపాలన నడుస్తోందని విమర్శించారు. మాచర్ల నియోజక వర్గంలో చేతకాని వైసిపి నాయకులు పోలీసులను అడు పెట్టుకొని టిడిపి కార్యకర్తలను వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. సామాజిక న్యాయం అని చెప్పుకొనే ఈ ప్రభుత్వం ఎస్సి, ఎస్టీ, బీసీ వర్గాలపై దాడు లకు పాల్పడుతోందని మండిపడ్డారు. పోలీస్ స్టేషన్ లలో కస్టోడియల్ టార్చర్ లు ఎక్కువయ్యాయని ఆరోపించారు. భవిష్యత్తు లో కస్టోడియల్ టార్చర్ జరిగితే సామూహికంగా పోలీస్ స్టేషన్ లు ముట్టడిస్తామని హెచ్చరించారు. వైసిపి నాయకుల చేతిలో దెబ్బలు తిన్న టిడిపి కార్యకర్తల పైనే కేసులు నమోదు చేయడం దుర్మార్గమన్నారు. పోలీసులు, టిడిపికార్యకర్తలను వెంటాడి వేటాడి అర్ధరాత్రుల్లో ఇంటి నుంచి బయటకు తీసుకువెళ్లి కస్టోడియల్ టార్చర్ లకు గురిచేస్తున్నారని ఆరోపించారు. కార్యకర్తలను కొట్టి వారి గాయాలు మానే వరకు వారిని పోలీసుస్టేషన్‌లోనే ఉంచు తున్నారని, ఇటువంటి సంఘట నలు పునరావృతమైతే పోలీసులు తీవ్ర పరిణామాలు ఎదు ర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆయన వెంట మండల టిడిపి అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి యాదవ్, బొల్లా వెంకటేశ్వర్లు చౌదరి, ఎరిపల్లి వెంకటేశ్వర్లు, మైలపల్లి అప్పలరాజు,వస్తుపురి శ్రీరా మూర్తి, సైదారావు, ఆడెపు కోటయ్య నూకరాజు ఉన్నారు.

'అధైర్య పడొద్దు అండగా ఉంటా'

విజయపురిసౌత్ ఆంధ్రజ్యోతి విలేకరి గొల్లా.పుల్లయ్య అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న జూలకంటి బ్రహ్మారెడ్డి ఆదివారం ఆయన స్వగహానికి వెళ్లి పరామర్శించారు. అధైర్య పడొద్దని అండగా ఉంటానని హామీ ఇచ్చారు. పుల్లయ్య ఆరోగ్య సమాచారం గురించి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు.గుంటూరు లోని ప్రయివేటు వైద్యశాలకు వెళ్లి చికిత్స చేయించుకోవా లని సహకారం, అందిస్తానని హామీ ఇచ్చారు. ముందుగా పసువేములలో దోసపాటి యల్లారావు కుమార్తె పుష్పా లంకరణలో పాల్గొని ఆశీస్సులు అందించారు. అనంతరం చింతల తండాలో టిడిపి నాయకుడు రమావత్ బసు కుమార్తె నాగలక్ష్మి వివాహానికి హాజరై వధూవరులకు శుభా కాంక్షలు తెలియజేశారు.

దేశవరపు క్యాంపు తండా లో బాధితుడు రామచంద్ ని పరామర్శిస్తున్న బ్రహ్మారెడ్డి

అవగాహన కార్యక్రమం లో మాట్లాడుతున్న డాక్టర్ ధర్మ సింగ్ శాస్త్రి

దోమలతో సంక్రమించే వ్యాధులతో జాగ్రత్త

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

దోమలు ద్వారా సంక్రమించే వ్యాదులు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సత్తెనపల్లి మలేరియా సబ్ యూనిట్ అధికారి సిహెచ్ ప్రభాకర్ రెడ్డి సూచించారు. సత్తెనపల్లి 13 వార్డు సచివాలయంలో ప్రపంచ దోమల దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఆశ ఆరోగ్య కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ సర్ రోనాల్డ్ రాస్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ ఆరోగ్య కేంద్రం డాక్టర్ జి.ధర్మసింగ్ శాస్త్రి మాట్లాడుతూ సర్ రోనాల్డ్ రాస్ మలేరియా వ్యాధి కారక ప్లాస్మా డియం పరాన్న జీవి ఆడ ఎనాఫిలస్ దోమలు ద్వారా వ్యాప్తి చెందుతుందని 1897 ఆగస్టు 20న కనుగొన్నారని తెలియజేశారు. ఆరోజు నుండి ఆ తేదీ నాడు ప్రపంచ దోమల దినోత్సవం నిర్వహిస్తున్నారని వివరించారు. దోమలు ద్వారా సంక్రమించే వ్యాదులు పట్ల ప్రజలకు అవగాహన కల్పించి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిస్తామని ఆరోగ్య కార్యకర్తల చేత ప్రతిజ్ఞ చేయించారు. జ్వరం లక్షణాలు ఉన్నట్లైతే దగ్గరలజో ఉన్న ప్రభుత్వ వైద్యశాలలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి ప్రభాకర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం డాక్టర్ మహబూబ్ ఆలీ. హెల్త్ సూపర్‌వైజర్లు వై.రాజేష్‌పాల్, హెల్త్ అసిస్టెంట్లు హుస్సేన్ , షరీఫ్ పాల్గొన్నారు

అనన్య హాస్పిటల్ ఆధ్వర్యంలో రేపు వికలాంగులకు, వృద్ధులకు ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా మంగళవారం అనన్య హాస్పిటల్ సింగరాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో పల్నాడు బస్టాండ్ లోని అనన్య హాస్పిటల్‌లో వికలాంగులకు, వయోవృద్ధులకు ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు అనన్య హాస్పిటల్స్ అధినేత డాక్టర్ సింగరాజు సాయికృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు వైద్య శిబిరం, మెగా రక్త దాన శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బిపి, షుగర్, ఈసీజీ, థైరాయిడ్ మరియు ఊపిరి తిత్తుల సామర్థ్యం తెలిపే పరీక్షలు ఉచితంగా నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. రక్తదాన శిబిరంలో చిరంజీవి అభిమానులు యువత పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

ముప్పాళ్లలో ప్రమాదభరితంగా విద్యుత్ వైర్లు

ప్రజాశక్తి-ముప్పాళ్ల

మండల కేంద్రమెన ముప్పాళ్ల బిసి కాలనీలో తెగిపోయి వేళ్లాడుతున్న విద్యుత్ వైర్లు ప్రమాదభరితంగా మారాయి. కాలనీలోని ప్రజలు భయానికి గురి చేస్తున్నాయి. ఈ విషయమై విద్యుత్ శాఖ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆ కాలనీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే విద్యుత్ అధికారులు స్పందించి వేళ్ళాడుతున్న తగు చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు.

కాలం చెల్లిన చెత్తబండ్లతో కార్మికుల పాట్లు!

- ఊడిపోతున్న నెట్టుడు బండ్ల గాన్లు, రబ్బర్లు అరిగి పోయిన రబ్బర్లు, తుప్పుపట్టిన రేకులు
- మరమ్మతులకు డబ్బులివ్వని అధికారులు, కాంట్రాక్టర్
- కాల్వల్లో మట్టిని తీసేందుకు, చెత్త సేకరణకు ఒకే బండితో రెండు పనులు
- సమస్యలతో చిలకలూరిపేటలోని పారిశుధ్య కార్మికులు సతమతం

పక్కకు వంగిపోయిన నెట్టుడిబండి గానులో చెత్తను తరలిస్నున్న పారిశుద్ధ్య కార్మికులు, విరిగిపోయిన గానును చూపుతున్న కార్మికుడు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పారిశుధ్య పనుల నిమిత్తం స్థానిక మున్సిపాలిటి వారు నెలకు లక్షల రూపాయల్లో ఖర్చు పెడుతున్నారు. కానీ, పారిశుధ్య కార్మికులకు ఇచ్చే పనిముట్ల విషయంలో అల సత్వం, నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనబడుతోంది. మున్సిపాలిటి పరిధిలో మొత్తం 38 వార్డులు ఉండగా, అందులో 32 వార్డులు ఒక్క పట్టణంలోనే ఉన్నాయి. మిగిలిన 6 వార్డులను కొత్తగా పట్టణంలో చేర్చారు. పట్టణంలో పారిశుధ్య కార్మికుల సంఖ్య సుమారు 250 వరకు ఉంటుంది. గత ప్రభుత్వం హయాంలో పట్టణంలో ఉన్న వార్డులను 15 మైక్రో పాకెట్లుగా విభజించి 15 నెట్టుడి బండ్లను ఇచ్చారని వారు చెబుతున్నారు. ప్రస్తుతం చెత్త ఆటోలు వచ్చాయి. కానీ తమకు చాకిరి మాత్రం తప్పట్లేదని, చెత్త ఆటోలు 10 రోజులు తిరిగితే 15 రోజుకు తిరగడం లేదని చెబుతున్నారు.చెత్తను సేకరించే నెట్టుడు బండ్లు పాతబడి పోవడంతో వాటి గాన్లు ఊడిపోవడం, వాటికి ఉన్న రబ్బర్లు అరిగి పోవడం, చుట్టూ ఉన్న రేకు తుప్పుపట్టి ఊడి పోతు న్నాయి. వీటి మరమ్మతులకు అధికారులు కానీ కాంట్రాక్టర్లు గాని నయా పైసా కూడా ఇవ్వడం లేదని చెబుతున్నారు. ఆ ఖర్చులను తామే భరిస్తున్నామని అంటున్నారు. స్థానిక పండరీపురంలోని మూడు వార్డులను కలిపి సేక రించేందుకు ఒక చెత్త బండి ఉందని ఆ వార్డుకు సంబంధిం చిన పారిశుధ్య కార్మికులు చెబుతున్నారు. వీల్ సెట్ ఊడి పోయిందని, దీనిని బాగుచేయాలంటే సుమారు రూ.4 వేలు ఖర్చు అవుతుందని, అది కూడా విజయవాడలో మాత్రమే బాగు చేస్తారని, దీనిని బాగు చేయించాలంటే రెండు, మూడు రోజుల పనులు మానుకోవాల్సి వస్తుందని చెప్పారు. వీధులను శుభ్రం చేసి ఆ చెత్తను ఒక చోటకు చేరిస్తే లారీ వచ్చి తీసుకుపోతోందని అంటున్నారు.

ఈ నెట్టుడి బండ్లతో ఉదయం పూట కాల్వలు బాగు చేసి వాటిలోని మట్టిని తీస్తామని, తిరిగి ఇదే బండిని చెత్తను సేకరించేందుకు కూడా వాడుకోవాల్సి వస్తోందని, ఇవి పాతబండ్లు కావడంతో మరమ్మతులు వస్తున్నాయని చెబుతున్నారు. ఇప్పటికైనా పాతనెట్టుడి బండ్ల స్థానంలో కొత్త వాటిని ఇవ్వాలని లేదా వీటికి అయ్యే మరమ్మతుల ఖర్చులకు డబ్బులైనా ఇవ్వాలని పారిశుధ్య కార్మికులు విజ్ఞపి చేస్తు న్నారు. అంతేకాకుండా తమకు ఇచ్చే అరకొర జీతాలు కూడా సరిగా ఇవ్వకపోవడం అన్యాయమని వాపోయారు. తమకు ఇవ్వాల్సిన జులై జీతాలు ఆగస్టు 15 వ తేదీన ఇచ్చారని, ప్రతి నెలా మొదటి వారంలో ఇవ్వాలని కోరారు.

పాత నెట్టుడు బండ్లను తుక్కు కింద అమ్మాలి

సిఐటియు మండల కార్యదర్శి పేరుబోయిన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజా ధనాన్ని వృథా చేయకుండా వెంటనే ఈ పాత నెట్టుడు బండ్లను తుక్కు కింద అమ్మివేయాలని మున్సిపాలిటీ వారికి సూచించారు. మిగిలినవి బండ్లకు మరమ్మతులు చేయించాలని, గాన్లకు రాసేందుకు గ్రీజ్ వంటివి ఇవ్వాలని, ఎండ, వానలలో పనిచేసే పారిశుధ్య కార్మికులకు రక్షణ కవచాలు ఇవ్వాలని, కనీస వేతనం రూ. 26,000 ఇవ్వాలని, కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, చెత్త ఆటోలు నడిపే డ్రైవర్లకు జీతం కింద రూ. 18,500 ఇవ్వాలని కోరారు.

అంగన్వాడీలకు చేసిన వాగ్దానాలు నెరవేర్చండి

సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి - మాచర్ల

ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికలకు ముందు చేసిన పాదయాత్రలో భాగంగా అంగన్వాడి టీచర్లకు, వర్కర్లకు అనేక వాగ్దానాలు చేశారని, వాటిని నెరవేర్చాలని సిఐటియు డిమాండ్ చేసింది. స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆదివారం అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ మాచర్ల డివిజన్ కమిటీ సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా సిఐటియు జిల్లా నాయకులు ఆంజనేయులు నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో అంగన్వాడీ వర్కర్స్ కి ఇచ్చే జీతాలు కంటే వెయ్యి రూపాయల అదనంగా ఇస్తానన్న జగన్, ఎక్కువ ఇవ్వకపోగా ఎన్నో ప్రయోజనాలను రద్దు చేశారని విమర్శించారు. అంగన్వాడీ వర్కర్లకు ఇచ్చిన మాట ప్రకారం వారి జీతాలు పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్‌లు మిగిలిన న్యాయపరమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. గత రెండు దఫాలుగా ఈ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపట్టినా ప్రభుత్వం స్పందించకపోవడంపై నిరసన వ్యక్తం చేశారు. అంగన్వాడీల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు శివకుమారి, రుక్మిణి, పద్మ, సైదమ్మ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆంజనేయులు నాయక్

ప్రమాదాన్ని తెచ్చే మూఢ నమ్మకాలను వదిలేయాలి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

స్థానిక ఆర్‌వియస్‌సివియస్ హైస్కూల్‌లో పల్నాడు జిల్లా హేతువాద సంఘ ప్రథమ మహాసభ ఆదివారం నిర్వహించారు.భారత హేతువాద సంఘ ప్రధాన కార్యదర్శి మేడూరి సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన ఈ సభ విజయవంతంగా జరిగింది. హేతువాద మానవవాద అధ్యయన తరగతుల్లో 'మూఢ విశ్వాసాలు - హేతువాదం' అనే అంశంపై ఎపి హేతువాద సంఘ సహాయ కార్యదర్శి సింహాద్రి యల్ల మందారెడ్డి, 'వైజ్ఞానిక దృక్పథం - హేతువాదం' అనే అంశంపై అమరావతి హేతువాద సంఘ అధ్యక్షులు రేజేటి వెంకటేశ్వర్లు ప్రసంగించారు. అనంతరం మేడూరి రచన 'మానవుడు - మానవత్వం' అనే గ్రంథాన్ని ఆలూరి ప్రఫుల్ల చంద్ర ఆవిష్కరించారు. సాయంత్రం 'విశ్వ తత్వం-పరిణామం' అనే అంశంపై సత్యనారాయణ, 'హేతుబద్ధ ఆలోచన - ఆవశ్యకత' అంశంపై ఎపి హేతువాద సంఘ ప్రధాన కార్యదర్శి షేక్ దరియావలి ప్రసంగించారు. మహాసభకు హాజరైన వారిలో ఇతర వక్తలు ప్రసంగిస్తూ మనుషులు హేతుబద్ధంగా స్వతంత్రంగా స్వేచ్ఛగా ఆలోచించాలన్నారు. మనుషులను, మత విశ్వాసాలు ఆలోచనా రహితులుగా మార్చుతున్నాయన్నారు. నిత్య జీవితంలో హేతుబద్ధ ఆలోచన అవసరం ఉందని,.ఏమిటి? ఎందుకు? ఎలా? వంటి ప్రశ్నలతో విశ్వ అవగాహన పెంచుకోవాలని, మూఢ నమ్మకాలను వదలాలని సూచించారు. అనంతరం పల్నాడు జిల్లా హేతువాద సంఘ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా హేతువాద సంఘం అధ్యక్షులుగా మేడూరు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా చిన్న మస్తాన్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా ఐదుగురు సభ్యులను ఎన్నుకున్నారు.

మాట్లాడుతున్న చిన్నమస్తాన్

ప్రజా సమస్యలను విస్మరించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

- సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి రామారావు
- రాజకీయ పరిణామాలపై 25న సభ జయప్రదానికి పిలుపు
- హాజరుకానున్న సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు

ప్రజాశక్తి-తాడేపల్లి

దేశంలో, రాష్ట్రంలో వేగంగా మారుతున్న రాజకీయ పరిణామాలపై 25న గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సభను నిర్వహిస్తున్నట్లు సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు తెలిపారు. సభకు ముఖ్య అతిథిగా సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు హాజరై వివిధ అంశాలపై వివరిస్తారని చెప్పారు. ఈ మేరకు ఉండవల్లిలోని సిపిఎం కార్యాలయం, తాడేపల్లిలోని మేకా అమరారెడ్డి భవన్‌లో సిపిఎం విస్తృత సమావేశాలు ఆదివారం నిర్వహించారు. ఉండవల్లిలో సమావేశానికి సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శవర్గ సభ్యులు వల్లభాపురం వెంకటేశ్వరరావు, తాడేపల్లిలో సభకు సిపిఎం పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు డి.శ్రీనివాసకుమారి అధ్యక్షత వహించారు. రామారావు మాట్లాడుతూ ఢిల్లీలో సిపిఎం కేంద్ర కార్యాలయానికి ఢిల్లీ పోలీసులు తాళం వేయడాన్ని నిరసించారు. కార్యాలయంలో మూడ్రోజుల పాటు జరుగుతున్న దేశంలోని అభ్యుదయ వాదుల సమావేశాన్ని జరగకుండా చూడటమే బిజెపి ఉద్దేశమన్నారు. అందులో భాగంగానే పోలీసులను ఉసిగొల్పి ఓ జాతీయ పార్టీ కార్యాలయానికి తాళాలు వేయించిందని మండిపడ్డారు. ప్రజల సమస్యలను గాలికొదిలేసి, నిత్యావసర వస్తువుల ధరలను అడ్డగోలుగా పెంచిందని విమర్శించారు. వీటికి తోడు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల మంట మండించిందన్నారు. విద్యుత్ అదనపు ఛార్జీల పేరుతో కొత్త రకం దోపిడీకి తెరదీశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి విధానాలను యథావిధిగా రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం అమలు చేస్తోందని, విమర్శించారు. దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు అప్పగించడం మోడీ మానుకోవాలన్నారు. సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి, సిపిఎం తాడేపల్లి పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు జి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ రాజధానికి నిధులు కేటాయించని కేంద్ర ప్రభుత్వాన్ని అధికార, ప్రతిపక్ష పార్టీలు నిలదీయడంలో విఫలమయ్యాయని అన్నారు. బిజెపి ప్రమాదాన్ని 80 ఏళ్ల క్రితం పశ్చిమ బెంగాల్‌లోని గురుగ్రాంలో సుభాష్ చంద్రబోస్ వివరించారని తెలిపారు. సమావేశాల్లో వీరవెంకయ్య, సిహెచ్. సుందరరావు, ఎస్‌కె పీరూసాహెబ్, బాబూరావు, కె.కరుణాకరరావు, ఎస్.ముత్యాలరావు, డివి భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ధనలక్ష్మి

ఆశాలకు కనీస వేతనాలివ్వాలి

- బెనిఫిట్స్ ఏమీ ఇవ్వకుండానే 60 ఏళ్లకు రిటైర్‌మెంట్
- సమస్యల పరిష్కారం, జీవన భద్రత కోసం అక్టోబర్ 30న చలో ఢిల్లీ

ప్రజాశక్తి-గుంటూరు

ఆశా వర్కర్లను కార్మికులుగా గుర్తించి కనీస వేతనాలు చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, గ్రూప్ ఇన్సూరెన్స్, సెలవులు, పెన్షన్ తదితర సౌకర్యాల వర్తింపజేయలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.లక్ష్మి డిమాండ్ చేశారు. వీటి సాధన కోసం అక్టోబర్ 30న నిర్వహించే చలోఢిల్లీ కార్యక్రమానికి జిల్లాలోని ఆశా వర్కర్లు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పాతగుంటూరులోని సిఐటియు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశానికి ధనలక్ష్మి అధ్యక్షత వహించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం గత తొమ్మిదేళ్లుగా ఆశా వర్కర్లకు ఒక్క రూపాయి కూడా వేతనాలు పెంచలేదని, రిటైర్మెంట్ బెన్ఫిట్స్ ఏమీ లేకుండానే 60 ఏళ్లకు రిటైర్మెంట్ చేస్తున్నారని అన్నారు. ఏళ్ల తరబడి ప్రభుత్వానికి సేవ చేసినా ఆశా వర్కర్లు రిటైర్మెంట్ అనంతరం కనీస పెన్షన్‌కు కూడా నోచుకోకపోవటం శోచనీయమన్నారు. డ్యూటీలో ఉండగా చనిపోయిన ఆశా వర్కర్లకు కనీసం మట్టి ఖర్చులను కూడా ప్రభుత్వం చెల్లించట్లేదని అన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆశ వర్కర్లకు తీవ్రమైన పనిభారం మోపిందని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అన్నింటినీ ఆశ వర్కర్లకు వర్తింపజేయకుండా రద్దు చేసిందని విమర్శించారు. కనీసమైన సెలవులు ఇవ్వకుండా వెట్టిచాకిరీ చేయిస్తున్నారని, పోరాడుతున్న వివిధ రంగాల ఉద్యోగులు, కార్మికులపై తీవ్రమైన నిర్బంధాలకు పూనుకుంటోందని మండిపడ్డారు. వాటిని అధిగమించి ఆశ వర్కర్లు పోరాడి తమ సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. సమావేశంలో స్వర్ణకుమారి, ధనలక్ష్మి పాల్గొన్నారు.

తాడేపల్లిలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఎక్కడ?

ప్రజాశక్తి-తాడేపల్లి

మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని తాడేపల్లిలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఎక్కడ అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. బైపాస్ రోడ్డు ఏర్పడిన తరువాత రాజధాని ఈ ప్రాంతంలో ప్రకటించిన తరువాత పెద్దఎత్తున అపార్టుమెంట్లు నిర్మితమయ్యాయి. విజయవాడ, గుంటూరు లాంటి పెద్ద నగరాల్లో ఉంటున్న అనేక వ్యాపార సంస్థలు ఇక్కడకు వచ్చాయి. మటన్, చికెన్ దుకాణాలూ ఏర్పాటయ్యాయి. తాడేపల్లి పంచాయతీగా ఉన్న కాలంలో ప్రతి ఆదివారం మటన్, చికెన్ దుకాణాల దగ్గర తెల్లవారుజామున శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆ ప్రాంతానికి వెళ్లి జీవాలను తనిఖీ చేసి సర్టిఫికెట్ చేసిన తరువాతే వాటిని వధించి విక్రయాలు జరిగేవి. కార్పొరేషన్ అయిన తరువాత నేడు ఆ పరిస్థితి కనిపించడంలేదు. వివిధ ప్రాంతాల్లో పెద్దఎత్తున ఆహార పదార్థాల విక్రయాలు పెరిగాయి. వీటిని తనిఖీ చేయాల్సిన ఇన్‌స్పెక్టర్ పోస్టు కొంతకాలంగా ఖాళీగా ఉంది. ఈ పోస్టును సత్వరమే భర్తీ చేసి మాంసం విక్రయాలపై పర్యవేక్షణ పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

ఆ అధికారుల పేర్లు రెడ్‌బుక్‌లో రాశాం

- టిడిపి అధికారంలోకి వచ్చాక వారెక్కడున్నా జైలుకే
- ఎమ్మెల్సీ అనురాధ, టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త అబద్దయ్య

విలేకర్లతో మాట్లాడుతున్న అనురాధ, అబద్దయ్య తదితరులు

ప్రజాశక్తి - మంగళగిరి

యువగళం పాదయాత్రను అడ్డుకోవడానికి ప్రయత్నించిన వారి పేర్లను రెడ్‌బుక్‌లో రాశామని, టిడిపి అధికారంలోకి వచ్చాక వారిపై విచారణ ఉంటుందని ఎమ్మెల్సీ పి.అనురాధ, టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త ఎన్.అబద్దయ్య అన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో జరిగిన యువగళం పాదయాత్రను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ వారు ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు స్థానిక టిడిపి కార్యాలయంలో ఆదివారం వారు విలేకర్లతో మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల టిడిపి శ్రేణులు సమిష్టిగా కృషి చేయడంతో పాదయాత్ర జన ప్రభంజనంతో హోరెత్తిందన్నారు. యువగళం పాదయాత్ర, హలో లోకేష్ కార్యక్రమం నియోజకవర్గ చరిత్రలో నిలిచిపోతుందని చెప్పారు. నియోజకవర్గంలోని సీతానగరం వద్ద యువగళం పాదయాత్ర 2500 కిలోమీటర్లు పూర్తి చేసుకోవడాన్ని లోకేష్ అదృష్టంగా భావిస్తున్నారని, పాదయాత్ర ముగిసిన తర్వాత నియోజకవర్గంలోని అందర్నీ లోకేష్ కలుస్తారని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే ఆర్కే మామూళ్లకు అలవాటుపడి, ఆయన అవినీతికి సహకరిస్తూ యువగళం పాదయాత్రను అడ్డుకోవడానికి ప్రయత్నించిన కొంతమంది కార్పొరేషన్ అధికారుల పేర్లు రెడ్‌బుక్‌లో రాశామని, అధికారంలోకి వచ్చిన తర్వాత వారి అవినీతిపై న్యాయవిచారణ చేసి జైల్లో కూర్చోబెడతామని వ్యాఖ్యానించారు. వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్నా, రిటైర్ అయినా, రాష్ట్ర వదిలి వెళ్లినా వదిలేది లేదన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ప్రతిపక్ష నాయకులను ఇబ్బందులకు గురిచేసిన 36 మంది అధికారులు జైలు పాలయ్యారనే విషయాన్ని అధికారులందరూ గుర్తుంచుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు పి.శ్రీనివాసరావు, ఎ.జయసత్య, వి.మైనర్ బాబు, ఎ.భూలక్ష్మి, డి.రాజు, షేక్ రియాజ్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి ప్రాంతంలో యువగళం పాదయాత్రను జయప్రదం చేసిన పట్టణ, రూరల్ ప్రజలకు టిడిపి తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు ఆదివారం ఓ ప్రకటనలో అభినందనలు తెలిపారు. లోకేష్ పాదయాత్రకు ప్రజలు స్వచ్ఛందంగా వచ్చారని, ఇదే ఒరవడి భవిష్యత్తులో కొనసాగించాలని కోరారు.

వితరణ కోసం విజ్ఞాన్‌లో నృత్య ప్రదర్శన

ప్రజాశక్తి-గుంటూరు

వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీలో ఆదివారం చారిటీ కోసం ఏర్పాటు చేసిన భరత నాట్యం నృత్య ప్రదర్శన కార్యక్రమం ఆకట్టుకుంది. అమెరికాలోని న్యూజెర్సీలో ఉన్న చాపిన్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న శ్రియగుత్తా ఈ నాట్య ప్రదర్శన చేసింది. దృష్టిలోపం ఉన్న విద్యార్థులకు నిధులు సేకరించాలనే ఉద్దేశంతో ఈ నృత్య ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. నృత్య ప్రదర్శన ద్వారా సేకరించిన నిధులను విజయవాడ గుణదలలోని విజయమేరీ ఇంటిగ్రేటెడ్ బ్లైండ్ స్కూల్‌కు విరాళంగా అందజేయనున్నారు. ఈమె తన 6వ ఏట నుంచే న్యూజెర్సీలోని బాలాదేవి చంద్రశేఖర్ దగ్గర భరత నాట్యంలో శిక్షణ పొందుతున్నారు. ఆమె నృత్యం ద్వారా కథలు, భావోద్వేగాలను తెలియజేయగల సామర్థ్యమే కాకుండా గణితంలోనూ ఈమె దిట్ట. నృత్యం, గణితంలో ఇతరులకు సహాయం చేయడం, ఇతరుల జీవితాలపై సానుకూల ప్రభావం చూపడం ద్వారా తాను ఎంతో సంతోషిస్తానని శ్రియ గుత్తా తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ శ్రీయాగుత్తా ప్రయాణం, అంకితభావం, అభిరుచి ఇతర విద్యార్థులకు, ప్రతిభావంతులకు స్ఫూర్తిదాయకమన్నారు. వయసుతో నిమిత్తం లేకుండా సమాజానికి తిరిగి ఇవ్వాలనే సదుద్దేశంతో నృత్య ప్రదర్శనల ద్వారా ఫండ్ సంపాదించడం గొప్ప పరిణామమన్నారు. అనంతరం శ్రీయ గుత్తాను, వారి తల్లిదండ్రులు గుత్తా స్రవంతి, శ్రీగోపికాంత్‌ను సన్మానించారు. కార్యక్రమంలో శ్రియ గుత్తా ఇతర కుటుంబ సభ్యులు, విజ్ఞాన్స్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.

సానుకూల దృక్పథం అలవర్చుకోవాలి

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

విద్యార్థులు సానుకూల దృక్పథాన్ని అలవరచుకోవాలని ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ ప్రియా చౌదరి అన్నారు. ఆదివారం కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీలోని ఆర్ అండ్ డి హాలులో నిర్వహించిన మానసిక వికాస తరగతులకు ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మొదటి, రెండవ సంవత్సరం బీటెక్ విద్యార్థినులకు అవగాహనా కల్పించారు. చెడు స్నేహాలకు దూరంగా ఉండాలని, ప్రతీ ఒక్కరూ ప్రత్యేకమైన లక్ష్యాలను ఏర్పరచుకుని వాటి సాధనకు కృషి చేయాలని చెప్పారు.

అనంతరం ఆమె వర్శిటీలోని మానసిక నిపుణులకు తరగతులను నిర్వహించారు. మహిళా అభివృద్ధి సెల్ కన్వీనర్ డాక్టర్ కె.రూత్ రమ్య మాట్లాడుతూ పలు అంశాలను వివరించారు. వర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారదివర్మ, ప్రో వైస్ చాన్సలర్లు డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఎఫ్ఇడి డైరెక్టర్ డాక్టర్ ఎ.జగదీష్, కో-ఆర్డినేటర్ శివగంగప్రసాద్, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ సిహెచ్.హనుమంతరావు, పూర్వవిద్యార్థుల అసిస్టెంట్ డైరెక్టర్, మహిళా అభివృద్ధి సెల్ కో-కన్వీనర్ డాక్టర్ కె.సోని, ప్రిన్సిపల్ డాక్టర్ టిఆర్‌కె.రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను నిరసించండి

మాదల బహిరంగ సభలో గద్దె చలమయ్య

ప్రజాశక్తి-ముప్పాళ్ల

కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు సిపిఎం నాయకులు నిరసించారు. మండలంలోని మాదలలోని సత్రం సెంటర్‌లో ఆదివారం బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభకు గ్రామ నాయకులు మార్పుల వెంకటరెడ్డి అధ్యక్షత వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు గద్దె చలమయ్య మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వచ్చిన తర్వాత పేద ప్రజలపై,ముఖ్యంగా దళితులు, ముస్లింల పైన దాడులు జరుగుతున్నాయని అన్నారు. మణిపూర్‌లో మహిళలపై దాడులు, అత్యాచారాలు కొనసాగుతున్నప్పటికీ మన రాష్ట్రంలో నిఅధికార పార్టీ ప్రతిపక్ష పార్టీల నాయకులు నోరుమెదపడం లేదని విమర్శించారు. భారత రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి మతోన్మాదాన్ని బిజెపి రెచ్చగొడుతోందని విమర్శించారు.

నిరంతరం పేదల పక్షాన నిలబడి పోరాటాలు చేస్తున్న ఏకైక పార్టీ సిపిఎం అన్నారు. పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ మాట్లాడుతూ రోజురోజుకి పెరుగుతున వస్తువుల ధరలు అదుపు చేయడంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని అన్నారు. సిపిఎం కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా సెప్టెంబర్ 1వ తేదీ నుండి 10 వరకు ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాల్లో ప్రజానీకం అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

బహిరంగసభలో సిపిఎం మండల కార్యదర్శి గుంటుపల్లి బాలకృష్ణ,మండల కమిటీ సభ్యులు జాలయ్య, పటాన్ సైదా ఖాన్, సత్యనారాయణ రెడ్డి, నాగేశ్వరరావు, పార్టీ మహిళ నాయకులు గద్దె ఉమశ్రీ, గుంటుపల్లి రజనీ పాల్గొన్నారు.

ఆర్ఎంపి, పిఎంపిల సమస్యలను పరిష్కరిస్తా

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

ఆర్ఎంపి,పిఎంపి ల సమస్యలు పరిష్కరిస్తానని సత్తెనపల్లి టిడిపి ఇన్‌ఛార్జి కన్నా లక్ష్మీనారాయణ హామీ ఇచ్చారు. కన్నా లక్ష్మీనారాయణను ఆదివారం ఆర్ఎంపి,పిఎంపి కమిటీ సభ్యులు కలిసి వారి సమస్యలను వివరించారు. వారి సమ స్యలపై సానుకూలంగా స్పందించిన ఆయన వారి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కన్నా లక్ష్మీనారాయణను ఘనంగా సత్కరించారు. కన్నాను కలిసిన వారిలో అమరావతి ఆర్ఎంపి, పిఎంపి అసోసియేషన్ అధ్యక్షులు కాకుమాను నాగే శ్వరరావు, కమిటీ సభ్యులు,అంకమ్మరావు, షేక్ సైదా,బ్రహ్మం, మల్లికార్జున రావు,తొండపి సైదా,గోవిందా చారి, పి. శ్రీనివాసరావు, బి.శ్రీను, వెంకటేశ్వర్లు, భద్రాచారి, సాంబశివ రావు ఉన్నారు

కన్నా లక్ష్మీనారాయణ ను కలిసిన ఆర్ఎంపిలు

టిడిపి నాయకుడికి పరామర్శ

అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సత్తెనపల్లి మండలం గర్నెపూడికి చెందిన టిడిపి గ్రామ కార్యదర్శి పురం ఆదామును ఆదివారం కన్నా లక్ష్మీనారాయణ పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతూ గుంటూరు లోని ప్రైవేట్ వైద్యశాలలోచికిత్స పొందుతున్నాడు. ఈ సమాచారం తెలుసుకున్న కన్నా లక్ష్మీనారాయణ ఆసుపత్రిలో చికిత్స పొందున్న ఆదామును పరామర్శించారు . ఆస్పత్రి డాక్టర్‌తో మాట్లాడి ఆదాం ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఆదామ్ కుటుంబ సభ్యులతో మాట్లాడారు. పార్టీ పరంగా అండగా ఉంటామని భరోసా కల్పించారు. కొంత ఆర్థిక సహాయాన్ని ఆదాము కుటుంబ సభ్యులకు అందించారు.

టిడిపి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పెదకూరపాడు

మండలంలోని పాటిబండ్ల గ్రామానికి చెందిన ప్రత్తిపాటి బసవయ్య కుటుంబానికి పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ టిడిపి నాయకుల ద్వారా రూ.5000 ఆర్థిక సహాయం ఆదివారం అందించారు.టిడిపి కార్యదర్శి అర్తిమళ్ళ రమేష్, ఏరువ బాలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భవనిర్మాణ కార్మికునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-సత్తెనపల్లి

జనసేన పార్టీ నాయకులు బుర్ర వెంకట అప్పారావు ఆదివారం సత్తెనపల్లి పట్టణంలో ఇంటింటి ప్రచార కార్యక్రమం చేపట్టారు. ప్రమాదవశాత్తు గాయపడి మంచానికే పరిమితమైన 5 వ వార్డుకు చెందిన భవన నిర్మాణ కార్మికుడు పెయింటింగ్ మేస్త్రి షేక్ సైదాను జనసేన పార్టీ నాయకులు బి.వెంకటప్పరావు, కె. సాంబశివరావులు సైదాను పరా మర్శించి పది వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకి ఘన నివాళి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

అతి చిన్న వయసులోనే ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన రాజీవ్ గాంధీ కంప్యూటర్, ఎలక్ట్రానిక్ రంగాన్ని అభివృద్ధి చేసి మోడరన్ ఇండియాగా భారతదేశాన్ని ప్రపంచ దేశాలు గర్వపడేలా చేశారని డీసీసీ అధ్యక్షులు జి.అలెగ్జాండర్ సుధాకర్ అన్నారు. పల్నాడు జిల్లా నరసరావుపేట కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 79వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా అలెగ్జాండర్ సుధాకర్ మాట్లా డుతూ అవినీతికి తావు లేకుండా దేశ ప్రజలకు సంక్షేమ ఫలాలను అందించిన ఘనత రాజీవ్ గాంధీకి దక్కుతుం దన్నారు. నేటితరం రాజకీయ నాయకుల కు రాజీవ్ గాంధీ జీవితం ఆదర్శనీయమన్నారు.ఆనాటి అభివృద్ధినే నేడు తాను సాధించినట్లు నేటి ప్రధాని మోడీ డిజిటల్ ఇం డియా పేరుతో ప్రచారం చేసు కుంటున్నారని విమర్శిం చారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు రాజీవ్ గాంధీ ఆశయాల సాధనకు అనుగుణంగా పార్టీని ముం దుకు తీసుకువెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో పిసిసి డెలిగేట్ ఎస్. కృష్ణ, జిల్లా నాయకులు ఎన్.బాజీ , మాజి కౌన్సిలర్ ఆర్.శ్రీనివాస్, జిల్లా ఎస్.సి సెల్ కంచర్ల ఇమ్మా నియేల్, జిల్లా బిసి సెల్ పూర్ణచంద్ర మంతెన నరసింహా రావు, రవి కిషోర్, మైనారిటీ సెల్ కాజా,ఎస్.సి సెల్ ఉదయ్ రమేష్ , సత్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - అమరావతి

రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా అమరావతి శ్రీ అమరలింగేశ్వర స్వామి గుడి వద్ద పల్నాడు జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గంటా గోపి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు ముప్పర ఉదయ్ శంకర్, తెన్నలూరి గోపి, కటారి సురేంద్ర,షేక్ సైదా వలి, కట్ట బుజ్జి,గంటా తిరుపతిరావు, బలుసు పాటి గోపి బొడ్డు, గోపి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పార్టీ ఇంచార్జి షేక్ సలీం, నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నగరపాలక సంస్థ కార్యాలయం, రాజీవ్ సెంటర్, భార్గవ్ పేటలలోని రాజీవ్ గాంధీ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో మంగళగిరి, తాడేపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులు కుప్పాకుల కృష్ణారావు చౌదరి, పఠాన్ సుభాని, జిల్లా కాంగ్రెస్ కాపు రిజర్వేషన్ సాధికార చైర్మన్ రేమినిశెట్టి హనుమంతరావు, పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కూర్మాల రాధిక, నాయకులు గోలి సాంబశివరావు, షేక్ జల్సు, కురగంటి చిక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరిలోని కాంగ్రెస్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న నాయకులు

నరసరావుపేటలోని కాంగ్రెస్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి-తెనాలి

స్థానిక మారీసుపేట లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్ గాంధీ జయంతి సభ ఆదివారం నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ చందు సాంబశివుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తొలుత రాజీవ్ చిత్రపటానికి నివాళులర్పించారు. రాజీవ్ గాంధీ సేవలను వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పి.నాగసూర్య శశిధరరావు, పి.స్టీవెన్ బాబు, శివకుమార్, బుల్లయ్య తదితరులు పాల్గొన్నారు

బిసివై పార్టీ అధ్యక్షుని కలిసిన ఆర్కే యాదవ్

ప్రజాశక్తి-అమరావతి

పెదకూరపాడు నియోజకవర్గం బీసీ నాయకులు , తెలుగు జనసేవ సమితి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్కే యాదవ్,టీమ్ భారత చైతన్య యువజన (బి సి వై) పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్ర ని ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పెదకూరపాడు నియోజకవర్గం పరిస్థితులు, పార్టీ బలోపేతానికి చేయాల్సిన కృషిని ఆర్కే వివరించారు.

ముప్పాళ్లలో అన్నదానం

ప్రజాశక్తి-ముప్పాళ్ల

మండల కేంద్రమైన ముప్పాళ్లలో వేంచేసియున్న పైడమ్మ తల్లి ప్రథమ వార్షికోత్సవ మహోత్సవం ఆదివారం అంగరంగవైభవంగా జరిగింది. ముప్పాళ్ల గ్రామ ప్రజలు మూడు రోజుల నుంచి సంబరంగా పైడమ్మ తల్లి విగ్రహానికి పసుపు నీళ్ళు సమర్పించి, పొంగళ్ళు చేసి అన్నదానం చేశారు. ప్రజలు అధికసంఖ్యలో పైడమ్మ తల్లిని దర్శించు కొని అన్నప్రసాదాలు స్వీకరించారు.

రాజకీయంగా అభివృద్ధి చెందాలి

ప్రజాశక్తి - మాచర్ల

నూర్‌బాషా నాయకులంతా ఐక్యంగా సంఘ బలోపేతానికి కృషి చేయాలని ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు మహమ్మద్ ఖాజావలి అన్నారు. ఆదివారం పట్టణంలోని మెడికల్ హాల్‌లో జరిగిన ఆ సంఘం నాయకుల సమీక్ష సమావేశానికి ఆయన హాజరయ్యారు. మహమ్మద్ ఖాజావలి మాట్లాడుతూ నూర్ భాషా సంఘస్తులంతా రాజకీయంగా అభివృద్ధి చెందేందుకు కృషి చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 20 లక్షల మందికి పైగా మైనార్టీలు ఉంటే అందులో 30 శాతానికి పైగా నూరు బాషాలున్నారన్నారు. అన్ని సంఘాల మాదిరిగా నూర్ బాషా సంఘం సంఘం నాయకులు కూడా చట్టసభల్లో ప్రాతినిధ్యం వహించినప్పుడే నూర్ బాషా లు రాజకీయంగా అభివృద్ధి చెందేందుకు సాధ్యపడుతుందన్నారు. నూర్ భాషాలను ఇప్పటివరకు అన్ని ప్రభుత్వాలు కేవలం ఓటు బ్యాంకులుగానే చూస్తున్నాయని, ఇప్పటికైనా నూర్ భాషాలంతా ఏకమై అభివృద్ధి చెందేందుకు కృషి చేయాలని కోరారు. అనంతరం పల్నాడు జిల్లా అధ్యక్షులు, సెక్రటరీలుగా షేక్ జానీ భాష(మార్బుల్ జానీ), షేక్ ఖాసిం సైదాలను నూతనంగా ఎన్నిక చేసి వారికి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మార్బులు జానీ మాట్లాడుతూ తనపై నమ్మకంతో పలనాడు జిల్లా బాధ్యతలు అప్పజెప్పిన ఉమ్మడి గుంటూరు జిల్లా నాయకులకు, సహకరించిన పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఖాజావలి, గుంటూరు నగర అధ్యక్షులు ఆదాం షఫీ, రాష్ట్ర యూత్ ప్రధాన కార్యదర్శి నాగూర్ వలి, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎస్.కె బాదన్ బాయి, పల్నాడు జిల్లా మీడియా కార్యదర్శి పల్నాడు టీవీ జానీ తదిరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలకూ అధికంగా విద్యుత్ బిల్లులు

అమలుకాని 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ - సిపిఎం ఎదుట జనం ఆవేదన

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధిలోని మెల్లెంపూడిలో ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల విద్యుత్తును ఉచితంగా ఇవ్వాలని సిపిఎం మండల కార్యదర్శి డి.వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. గ్రామంలోని ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సిపిఎం నాయకులు ఆదివారం పర్యటించి స్థానికుల సమస్యలను తెలుసుకున్నారు. 100-190 యూనిట్లు వాడినా అధికంగా బిల్లులు వస్తున్నాయని స్థానిక ఎస్సీ, ఎస్టీలు వాపోయారు. దీనిపై విద్యుత్ అధికారులను అడిగితే తాము నివసిస్తున్న ఇంటి స్థలం ఎక్కువగా ఉందని చెబుతున్నారని చెప్పారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ కూలీ నాలి చేసుకొని జీవించే పేదలపై విద్యుత్ బిల్లుల భారాలు దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా 200 యూనిట్లులోపు విద్యుత్‌ను ఉపయోగించే ఎస్సీ, ఎస్టీలకు బిల్లు వేయొద్దని కోరారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం తెచ్చిన విద్యుత్ సంస్కరణలను తూచా తప్పకుండా వైసిపి ప్రభుత్వం పాటిస్తోందని, అందుకే విద్యుల్ భారాలు మోపుతోందని మండిపడ్డారు. 2014 సంవత్సరం నుండి వాడిన విద్యుత్తుకు ట్రూఅప్ ఛార్జీల పేరుతో అదనపు బారాలు, 2019 సంవత్సరం నుండి 2023 సంవత్సరం వరకు 8 దఫాలుగా విద్యుత్ ఛార్జీలు పెంచడం దుర్మార్గమన్నారు. విద్యుత్ సంస్కరణలు వలన ఇటు సామాన్య ప్రజల పైన, వ్యవసాయ రంగం పైన అదనపు భారాలు పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజా సమస్యలపై సిపిఎం ఆధ్వర్యంలో 1-7 తేదీల్లో నిరసన కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బాణావత్ లక్ష్మీబాయి, నాయక్ పాల్గొన్నారు.

సిపిఎం మండల కార్యదర్శి వెంకటరెడ్డికి విద్యుత్ బిల్లులు చూపి ఆవేదనకు గురవుతున్న మెల్లంపూడి ఎస్సీ, ఎస్టీలు

మాట్లాడుతున్న డాక్టర్ వెంకటనాయుడు

మూత్రపిండాల సమస్యలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-గుంటూరు: మూత్రపిండాలు, మూత్రాశయం సమస్యలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానిక అరండల్‌పేటలోని అవగాహన కార్యాలయంలో ఆదివారం ఆరోగ్యసభ నిర్వహించారు. ప్రముఖ యూరాలజిస్ట్ డాక్టర్ వి.వెంకటనాయుడు పలు అంశాలపై వివరిస్తూ కిడ్నీలు చిక్కుడుగింజ ఆకారంలో వెన్నుపూసకు ఇరువైపులా ఉంటాయని, ఇవి నిరంతరం మన శరీరంలో రక్తాన్ని శుద్ధి చేసి, అన్ని అవయవాలకు రక్తాన్ని సరఫరా చేస్తూ ఉంటాయని అన్నారు. మనిషికి అవసరాలకు ఒక మూత్రపిండం సరిపోతుందని, ఒక మూత్రపిండం చెడిపోయినా మనకు లక్షణాలు కనపడవని చెప్పారు. మూత్రపిండాలు సరిగా పనిచేయకుంటే రక్తం శుద్ధి అవ్వదని, అప్పుడు బాధితునికి డయాలసిస్ చేయాల్సి ఉంటుందని అన్నారు. బిపి, షుగర్ ఉన్న వారికి మూత్రపిండాల సమస్యలు రావటానికి ఎక్కువ అవకాశాలుంటాయని, వీరు మూత్రపిండ సమస్యలకు సంబంధించి సీరం పరీక్ష, యూరిన్ పరీక్షలు ఏడాదిలో ఒక్కసారైనా చేయించుకోవాలని సూచించారు. మనం తీసుకునే ఆహారంలో ఉప్పు, జంక్‌ఫుడ్ తగ్గించాలని, అలాగని, అసలు ఉప్పు తినకుండా ఉండొద్దని అనాన్నరు. నీటిని రోజుకు కనీసం 4 లీటర్లు తాగటం మంచిదని, లేకుంటే మూత్రపిండాలలో రాళ్లు ఏర్పడతాయని సూచించారు. జన్యుపరంగా గానీ, జీవనశైలి మూలంగా గానీ, కిడ్నీలలో రాళ్లు ఏర్పడతాయని, అవి 5 ఎంఎం పరిమాణంలోపుంటే యూరిన్‌లో పడిపోతాయని, కానీ 5-10 ఎంఎం మధ్య పరిమాణంలో ఉంటే కొన్ని సందర్భాల్లో మందులతో, కొన్ని సందర్భాల్లో శస్త్ర చికిత్స చేయాల్సి వస్తుందని వివరించారు. నొప్పుల బిళ్లలు, కొన్ని రకాల మందుల వల్ల కూడా మూత్రపిండాలు, దెబ్బతింటాయన్నారు. మూత్రపిండాలు రోజుకు 180 లీటర్ల రక్తాన్ని శుద్ధి చేస్తుందని, రోజుకు మనిషి 3 లీటర్ల మూత్రం వచ్చేలా నీరు తాగితే మంచిదని, ఎక్కువ తాగితే ఎక్కువ మంచిదనే అభిప్రాయం సరికాదని తెలిపారు. శ్రమించి పనిచేసే వారు ఎక్కువ నీరు తీసుకొవచ్చన్నారు. మూత్రపిండ సమస్యున్న వారు తక్కువగా నీరు తాగటం మంచిదన్నారు. ప్రొస్టేట్ గ్రంధి 25-30 గ్రాముల వరకూ ఉంటే ఇబ్బంది లేదని, దాని బరువు పెరిగిన కొద్దీ దాని పరిమాణం పెరిగిన కొద్దీ ఒక్కోసారి మూత్రనాళంపై ఒత్తిడి పడి నొక్కుకుపోతాయని తెలిపారు. అనంతరం డాక్టర్‌ను అవగాహన సభ్యులు సన్మానించారు. సమావేశానికి కె.శివరామిరెడ్డి అధ్యక్షత వహించగా సాయిరాం, రత్నారావు, పి.వి.రెడ్డి పాల్గొన్నారు.

దేశ, రాష్ట్ర హితం కోసం బిజెపి, వైసిపిని ఓడించాలి

సిపిఐ బస్సు యాత్రలో భాగంగా 26న తుళ్లూరులో బహిరంగ సభ : ముప్పాళ్ల నాగేశ్వరరావు

ప్రజాశక్తి - తుళ్లూరు

దేశ, రాష్ట్ర హితం కోసం కేంద్రంలో బిజెపిని, రాష్ట్రంలో వైసిపిని ఓడించాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. మోడీ అండతోనే జగన్‌మోహన్‌రెడ్డి దుర్మార్గపు పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. రాజధాని ప్రాంతం తుళ్లూరులోని రైతు దీక్షా శిబిరాన్ని ఆదివారం సందర్శించిన ఆయన సిపిఐ నిర్వహిస్తున్న బస్సు యాత్రపై మాట్లాడారు. 'రాష్ట్రాన్ని రక్షించండి - దేశాన్ని కాపాడండి' అనే నినాదంతో ఈనెల 17వ తేదీ నుంచి వచ్చేనెల 8వ తేదీ వరకు సిపిఐ అధ్వర్యంలో బస్సు యాత్ర జరుగుతుందని చెప్పారు. విశాఖ నుంచి బస్సు యాత్ర బయలుదేరి తిరుపతిలో భారీ బహిరంగ సభతో ముగిస్తుందని, ఈ క్రమంలో ఈనెల 26న తుళ్లూరులో బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. అమరావతి ఉద్యమానికి మొదటి నుంచీ సిపిఐ మద్దతుగా నిలిచిందని, రైతులు, రైతు కూలీలు, మహిళలు, వృత్తిదార్లు, ఇతర వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో బహిరంగ సభలో పాల్గొని అమరావతి గళం వినిపించాలన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి జె.అజయ్‌కుమార్, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవివి ప్రసాద్ మాట్లాడుతూ రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిట్ట నిలువునా మోసం చేశాయన్నారు. జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి పదవి అనేది కేసుల నుంచి తప్పించు కోవడానికే తప్ప ప్రజలకు మేలు చేయడానికి కాదన్నారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఎం.శివశంకరరావు, జివి రాజు, రైతు జెఎసి నాయకులు డి.రామారావు, జి.స్వరాజ్యరావు, కె.అప్పారావు పాల్గొన్నారు. అనంతరం తుళ్లూరులోని సాయిబాబా మందిరం సమీపంలో స్థలాన్ని సభ నిర్వహణ కోసం నాయకులు పరిశీలించారు.

దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు

డ్రైవింగ్ శిక్షణ కోసం దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - గుంటూరు

గుంటూరు పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని లైట్ మోటార్ వెహికల్ లైసెన్స్ కలిగిన వారికి హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ ట్రైనింగ్ స్కూల్ ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్, గుంటూరు-2 డిపో మేనేజర్ ఎస్‌కె అబ్దుల్ సలామ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ డ్రైవింగ్ స్కూల్‌లో ఇప్పటివరకు 11 బ్యాచ్‌లు శిక్షణ పూర్తి చేసుకున్నాయని, త్వరలోనే 12వ బ్యాచ్‌ను ప్రారంభించబోతున్నామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు పేర్లు నమోదు చేసుకోవాలని, ఒక్కొక్క బ్యాక్‌కు 16 మందికే అవకాశం ఉంటుందని తెలిపారు. శిక్షణలో భాగంగా ప్రతిరోజూ ఒక గంట వాహనంలోని భాగాలు, వాటి పనితీరుపై వివరణ ఉంటుందని, వివిధ రకాల రోడ్ల గురించి, రోడ్ల పైన ఉండే పెయింటింగ్ మార్కుల గురించి, రోడ్ల ప్రక్కన ఉండే సైన్ బోర్డులు, సిగ్నల్ బోర్డుల గురించి చెబుతామని తెలిపారు. దీంతోపాటు ప్రతిరోజు ప్రాక్టికల్‌గా ప్రతి ఒక్కరితోనూ 15 కిలోమీటర్ల పాటు బస్సును నడిపిస్తామని, వీడియో విజువల్స్ ద్వారా ప్రమాదాలు జరిగే తీరును చూయించి వాటి నివారణపై వివరిస్తామని పేర్కొన్నారు. ఘాట్ రోడ్‌లో భయమేమీ లేకుండా నడుపడానికి కొండవీడు, కోటప్పకొండ ఘాట్ రోడ్లలో బస్సులు నడిపిస్తామని తెలిపారు. శిక్షణ పూర్తయ్యాక ధ్రువపత్రాలు జారీ చేస్తామని, ఆర్టీఏ నిర్వహించే పరీక్షలో వీటి ద్వారా పాల్గొని లైసెన్స్ పొందొచ్చని పేర్కొన్నారు. వివరాల కొరకు 8897371003, 7382894585 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

అరుణాచలానికి ఆర్టీసీ హైటెక్ బస్సులు

అరుణాచలంలో ఈనెల 31న పౌర్ణమి సందర్భంగా జరిగే గిరి ప్రదక్షణకు గుంటూరు-2 డిపో నుండి ప్రత్యేకంగా హైటెక్ బస్సులను ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ ఎస్‌కె అబ్దుల్ సలామ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బస్సులు ఈనెల 29వ తేదీ రాత్రి 9.15 గంటలకు గుంటూరులో బయలుదేరి 30న శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం గోల్డెన్ టెంపుల్‌ను దర్శించుకుని అదే రోజు రాత్రి అక్కడ నుండి బయలుదేరి 31న ఉదయం అరుణాచలం చేరుకుంటాయని తెలిపారు. అరుణాచలేశ్వరుని దర్శనం అనంతరం 31వ తేదీ సాయంత్రం అరుణాచలంలో బయలుదేరి సెప్టెంబర్ 1న ఉదయం 6:30 గంటలకు గుంటూరుకు చేరతాయని వివరించారు. ఈ సర్వీస్‌లకు 96164 సర్వీస్ నెంబర్‌ల ద్వారా ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేసుకొనే అవకాశం కల్పించామని, ఒక్కో టికెట్ ధర రూ.2420గా నిర్ణయించామని తెలిపారు. వివరాలకు 7382897459, 7382896403, 9959225421 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

బోనస్‌ను పంపిణీ చేస్తున్న పాలకేంద్రం అధ్యక్షులు శ్రీనివాసరావు

పాడి రైతులకు సంగం డెయిరీ బోనస్ పంపిణీ

ప్రజాశక్తి- మేడికొండూరు

మండలంలోని భీమినేనవారిపాలెం పాల ఉత్పత్తిదారుల సహకార సంఘంలో పాడిరైతులకు ఆదివారం బోనస్‌ను పంపిణీ చేశారు. 45 మంది పాల ఉత్పత్తి దారులకు రూ.2,15,245ను అందించారు. రెంటపాళ్ల బిఎంసి మేనేజర్ టి.గోపి మాట్లాడుతూ పాల ఉత్పత్తిదారుల సంక్షేమమే ధ్యేయంగా సగండెయిరీ పనిచేస్తుందన్నారు. రైతులకు బీమా కింద రూ.50 వేలు, పశు బీమా పథకం, నాణ్యమైన గడ్డి విత్తనాలను రైతులకు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు జి.శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ ఎం.నవీన్, డి.కోటేశ్వరావు పాల్గొన్నారు.

రొనాల్డ్ రాస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మలేరియా సిబ్బంది

సర్ రోనాల్డ్ రాస్‌కు నివాళులు

ప్రజాశక్తి-తెనాలి

ప్రపంచ దోమల దినోత్సవాన్ని పురస్కరించుకొని సర్ రోనాల్డ్ రాస్‌కు మలేరియా, ఫైలేరియా యూనిట్ల సిబ్బంది పట్టణంలోని మలేరియా యూనిట్ కార్యాలయం వద్ద ఆదివారం నివాళులర్పించినారు. ఇన్‌ఛార్జి అసిస్టెంట్ మలేరియా అధికారి వంగల పున్నారెడ్డి మాట్లాడుతూ బ్రిటిష్ వైద్యులు, శాస్త్రవేత్త అయిన సర్ రోనాల్డ్ రాస్ 1857 ఆగస్టు 20న ఆడ అనాఫిలస్ దోమకాటు ద్వారా, మలేరియా వ్యాధి ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుందని నిరూపించారని తెలిపారు. అందుకే ప్రతి ఏటా ఆ రోజును ప్రపంచ దోమల దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం సెయింట్ పీటర్స్ మల్టీపర్పస్ హెల్త్ వర్కర్స్ నర్సింగ్ స్కూల్ నందు ప్రిన్సిపల్ డి.సునీత ఆధ్వర్యంలో విద్యార్థులకు దోమల నియంత్రణపై అవగాహన కల్పించారు. పట్టణ మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎస్.ఉమాకాంత్, ఫైలేరియా సీనియర్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ జి.రవికుమార్, డాక్టర్ బిబి జాన్, డాక్టర్ కిషోర్ కుమార్, డాక్టర్ మౌనిక కుమార్, డాక్టర్ దేవికవాణి, డాక్టర్ లిఖిత, డాక్టర్ మహిత, మలేరియా సూపర్వైజర్లు డి.శ్రీనివాసరావు, బి.మల్లేశ్వరరావు, డి.నాగమల్లేశ్వరరావు, రత్నాకర్, షేక్ రషీద్, షేక్ నవీద్, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.

పిహెచ్‌డి పొందిన యోగా గురువుకు సత్కారం

ప్రజాశక్తి-మంగళగిరి

యోగా గురువు వెంకటేశ్వర యోగి గురూజీ పద్మశ్రీ అవార్డుకు అర్హుడని, ఇందుకు ప్రభుత్వానికి సిఫార్సు చేస్తానని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు అన్నారు. మంగళగిరి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం శ్రీవెంకటేశ్వర యోగా సేవా కేంద్రం వ్యవస్థాపకులు వెంకటేశ్వర యోగి గురూజీ డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పీహెచ్‌డీ) పొందిన సందర్భంగా సత్కారసభ నిర్వహించారు. సత్కార గ్రహీత మాట్లాడుతూ జాతీయతా భావం తప్పనిసరిగా కలిగి ఉండాలే గానీ, అది ఇతర జాతులను బాధించేదిగా ఉండకూడదన్నారు. కార్యక్రమంలో ఆప్కో ఛైర్మన్ గంజి చిరంజీవి, శ్రీ వెంకటేశ్వర యోగా సేవా కేంద్రం ఉప ప్రధాన యోగాచార్య మంద్రు శ్రీనివాస కుమార్, డాక్టర్ జి.రామ్మోహనరావు, సీకే జూనియర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ ఎం.విజయ మోహనరావు పాల్గొన్నారు.

ఏషియన్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సాదియాకు నాలుగు స్వర్ణాలు

ప్రజాశక్తి-మంగళగిరి

షార్జాలో యూఎఇ వేదికగా మొట్టమొదటి ఏషియన్ యూనివర్సిటీస్ పవర్ లిఫ్టింగ్ కప్ పోటీలు ఈనెల 16వ తేదీ నుండి జరుగుతున్నాయి. ఈ పోటీల్లో మంగళగిరి పట్టణానికి చెందిన ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టింగ్ క్రీడాకారిని షేక్ సాదియా ఆల్మాస్ మరోసారి సత్తా చాటారు. ఆల్మాస్ నాలుగు బంగారు పతకాలు సాధించినట్లు కోచ్ షేక్ సంధాని ఆదివారం తెలిపారు. స్ట్రాంగ్ ఉమెన్ మెడల్ కూడా సాధించారన్నారు. ఆంధ్రప్రదేశ్ నుండి పాల్గొని ఈ పథకాలు సాధించినట్లుగా సందాని తెలిపారు. సాదియా ఆల్మాస్‌ను సౌత్ ఇండియా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.కోటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు ఎం.ప్రభాకర్, కార్యదర్శి ఎస్.సూర్యనారాయణ, గౌరవాధ్యక్షులు జి.వెంకటేశ్వరావు, నేషనల్ పవర్ లిఫ్టర్ బి.ప్రసాద్ అభినందించారు.

పెదమద్దూరు బ్రిడ్జి పనులకు ఎమ్మెల్యే పరిశీలన

ప్రజాశక్తి - అమరావతి

అమరావతి - తుళ్లూరు డబుల్ లైన్ రోడ్డు పనుల్లో భాగంగా రూ.44 కోట్లతో నిర్మిస్తున్న పెదమద్దూరు హైలెవల్ బ్రిడ్జి పనులను ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆదివారం పరిశీలించారు. 4 పిల్లర్లు పూర్తి కాగా ఐదో పిల్లర్ పనులు వేగంగా పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

ప్రజలకు సైన్స్ ఫలాలను అందించడమే లక్ష్యం

- ఇప్పటికీ రాజ్యమేలుతున్న అశాస్త్రీయ భావజాలం
- శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంచేందుకు జెవివి కృషి
- పల్నాడు జిల్లా మహాసభలో నాయకులు
- నూతన కమిటీ ఎన్నిక

మహాసభలో నాయకులు... మ్యాజిక్ చేసిన కెవి రమణను సత్కరిస్తున్న జెవివి నాయకులు

ప్రజాశక్తి - మాచర్ల

సైన్స్ ఎంతో పురోగమించినా దాని ఫలితాలు సామాన్యుల చెంతకు పూర్తిస్థాయిలో చేరలేదని, సమాజంలో అశాస్త్రీయ భావజాలం ఇంకా రాజ్యమేలుతూనే ఉందని జన విజ్ఞాన వేదిక (జెవివి) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎల్.వేణుగోపాల్ అన్నారు. జెవివి పల్నాడు జిల్లా 2వ మహాసభను పట్టణంలోని కృష్ణవేణి జూనియర్ కళాశాలలో ఆదివారం నిర్వహించారు. మహాసభకు జెవివి పల్నాడు జిల్లా గౌరవాధ్యక్షులు కె.ఆదినారాయణ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా హాజరైన వేణుగోపాల్ మాట్లాడుతూ సైన్స్ ఇప్పటికి పాఠ్య గ్రంథాల్లో ఉందేగాని జీవన విధానంగా మారలేదన్నారు. ఈ క్రమంలో తెలుగు ప్రజల్లో పనిచేస్తున్న అతి పెద్ద ప్రజాసైన్స్ ఉద్యమ సంస్థగా జెవివి కృషి మరింత కొనసాగాలన్నారు. అక్షరాస్యత, సారా వ్యతిరేక ఉద్యమం, కూల్ డ్రింక్ వ్యతిరేక ఉద్యమం లాంటి ఎన్నో పోరాటాలను జెవివి చేసిందని, పిల్లల్లో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించేందుకు నిర్వహిస్తున్న చెకుముకి టాలెంట్ టెస్ట్ ఎంతో ఆదరాభిమానాలను పొందిందని గుర్తు చేశారు. ఉన్నతమైన సమాజం కోసం చాలామంది తమ సమయాన్ని వెచ్చించి పని చేస్తున్నారని, అయితే శాస్త్రీయ ఆలోచన క్రమాన్ని కొన్ని శక్తులు అడ్డుకుంటున్నాయని, హేతు విరుద్ధ శక్తుల పట్ల ప్రజలను నిరంతరం అప్రమత్తం చేసే కర్తవ్యం జెవివి నేరవేరుస్తోందాని చెప్పారు. కృష్ణవేణి జూనియర్ కళాశాల డైరెక్టర్ అండ్ ప్రిన్సిపాల్ వెంకట్రామయ్య మాట్లాడుతూ ప్రజల్లో సైన్స్ పట్ల అవగాహన పెంచేందుకు, మూఢనమ్మకాలను పారద్రోలేందుకు విద్యావంతులు, మేధావులు తోడవాల్సిన అవసరం ఉందన్నారు. కె.ఆదినారాయణ మాట్లాడుతూ సమాజం బాగుంటేనే దేశం బాగుంటుందని, శాస్త్రీయ అవగాహనలు ఇందుకు కీలకమని చెప్పారు. జెవివి నిర్వహించే కృషికి అందరి సహకారం అవసరమన్నారు. జెవివి జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వాలు చరిత్రను వక్రీకరించే పనిలో పడ్డాయని, దాన్ని జెవివి పూర్తిగా ఖండిస్తోందని అన్నారు.

జిల్లా నూతన కమిటీ ఎన్నిక

అనంతరం జెవివి జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా డాక్టర్ బుచ్చిబాబు తిరిగి ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా జెవికెఎస్ ప్రసాద్ గౌరవాధ్యక్షులుగా కృష్ణవేణి కళాశాల ప్రిన్సిపాల్ వై.వెంకట్రామయ్య, కె.ఆదినారాయణ, ఉపాధ్యక్షులుగా కె.శ్రీనివాసరెడ్డి, ట్రెజరర్‌గా చలపతి రావు ఎన్నికయ్యారు. మహాసభలో ఎస్.చలపతిరావు, డాక్టర్ బెజ్జంకి జగన్నాథచార్యులు, ఎ.నాగేశ్వరరావు, ఎ.దుర్గాభవాని, ఎస్‌కె గాలిబ్, చైతన్య, రాఘవేంద్ర పాల్గొన్నారు. ఇదిలా ఉండగా మహాసభలో పట్టణంలోని వాణి విద్యానికేతన్ డైరెక్టర్ కెవి రమణ చేసిన మ్యాజిక్ ప్రదర్శన అందర్నీ ఆకట్టుకుంది. కేవలం చిన్నచిన్న ట్రిక్కులతో ప్రజల్ని స్వామీజీల పేరుతో ఎలా మోసం చేస్తుంటారో వివరించారు.

49 మంది వికలాంగులకు త్వరలో ఉద్యోగాలు

- నియోజకవర్గానికి 10 మందికి ద్విచక్ర వాహనాలు
- వృద్ధులకు గుర్తింపు కార్డులు
- ట్రాన్స్‌జెండర్లకు చేతివృత్తులపై నైపుణ్య శిక్షణ
- ఉమ్మడి గుంటూరు జిల్లా సహాయ సంచాలకులు సువార్త

వికలాంగులు, వృద్ధులు, ట్రాన్స్‌జెండర్లకు పలు పథకాలు అమలు చేస్తున్నట్లు వికలాంగులు, ట్రాన్స్‌జెండర్స్, వయోవృద్ధులు సంక్షేమ శాఖ ఉమ్మడి గుంటూరు జిల్లా సహాయ సంచాలకులు సిహెచ్.సువార్త తెలిపారు. ఒక్కో నియోజకవర్గానికి 10 మంది వికలాంగులకు ద్విచక్ర వాహనాలను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. 75 శాతం వైకల్యం ఉండి, 45 ఏళ్లలోపు వయస్సు కలిగినవారికి వాహనాలను అందిస్తున్నామన్నారు. వీటి కోసం అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్న ఆమె ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు తెలిపారు.

వికలాంగులకు కేటాయించిన ఉద్యోగాల భర్తీ చేస్తున్నారా?

ఉమ్మడి గుంటూరు జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల్లో వికలాంగులకు రిజర్వు చేసిన బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టాం. 2022-23 సంవత్సరంలో ప్రభుత్వం అనుమతించిన 49 పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ పూర్తయింది. ఇటీవల మెరిట్ జాబితా విడుదల చేశాం. అభ్యర్థుల వైకల్యం నిర్ధారణపై తాజాగా ధ్రువీకరణ జరగాల్సి ఉంది. త్వరలో వీరికి శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగాలకు జిల్లా కలెక్టరు పోస్టింగ్స్ ఇస్తారు.

ఏమేమి ప్రోత్సాహకాలు అందిస్తున్నారు?

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తమ శాఖ ద్వారా వికలాంగులకు రూ.3.16 లక్షల విలువైన ఉపకరణాలు జిల్లా కలెక్టర్ పంపిణీ చేశారు. మూడు చక్రాల మోటారు వాహనాలు, ల్యాప్ టాప్‌లు, టచ్‌ఫోన్లు, దృశ్య శ్రవణ యంత్రాలు, వీల్ చైర్లు లబ్ధిదారులకు పోలీసు పేరేడ్ గ్రౌండ్స్‌లో పంపిణీ చేశాం. వీరితో పాటు జిల్లాలో 75 మందికి మూడు చక్రాల సైకిల్స్, వీల్ చైర్స్, లాప్ ట్యాప్స్, టచ్‌ఫోన్లు, చేతికర్రలు, హియరింగ్ మిషన్లు ఉచితంగా పంపిణీ చేస్తున్నాం. అర్హులైన వారు మా కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా సర్వేచేసి జిల్లాలో 709 మంది వికలాంగులకు ఉపకరణాలు ఇచ్చేందుకు అంగీకరించింది.

వికలాంగులకు అందిస్తున్న రుణాలు?

నేషనల్ హ్యాండిక్యాప్డ్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌హెచ్‌ఎఫ్ డిసి) ద్వారా కనీసం రూ.2 లక్షలు, గరిష్టంగా రూ.10 లక్షలు రుణం నేరుగా ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటివరకు గుంటూరు జిల్లాలో ఇద్దరికి, పల్నాడు జిల్లాలో ఏడుగురికి ఇచ్చాం. ఇందుకు సంబంధించి తగిన ప్రాజెక్టు రిపోర్టులతో దరఖాస్తు చేసుకోవాలి. గరిష్టంగా పదేళ్ల సర్వీసు ఉన్న ప్రభుత్వ అధికారి ఒకరు దరఖాస్తు దారులకు ష్యూరిటీ ఇవ్వాల్సి ఉంటుంది. స్వయంగా వ్యాపారాలు చేసుకునే వారు దరఖాస్తు చేసుకోవచ్చు.

చదువుకునే వారికి వసతిగృహాలు?

గుంటూరు బృందావన్‌గార్డెన్స్‌లో 40 మంది బాలురకు ఉచితంగా వసతి గృహం నిర్వహిస్తున్నాం. నర్సరావుపేటలో అంధ విద్యార్థులకు ప్రత్యేకంగా వసతి గృహం ఉంది. ఇక్కడ 40 మంది అంధ విద్యార్థులు ఉన్నారు. నకరికల్లు మండలం చల్లగుండ్ల వసతి గృహంలో శారీరక వికలాంగులు దాదాపు 60 మంది వరకు ఉన్నారు.

వృద్ధులకు అందిస్తున్న సేవలు?

పురుషులకు 60 ఏళ్లు, మహిళలకు 58 ఏళు దాటిన వారికి గుర్తింపు కార్డులు జారీ చేస్తున్నాం. తద్వారా వీరికి ప్రభుత్వ పరంగా అందే కొన్ని ప్రత్యేక సదుపాయాలను ఉపయోగించుకోవచ్చు. ఆర్‌టిసి, రైల్వేలో టిక్కెట్లు రాయితీలు, బ్యాంకుల్లో అధిక వడ్డీ, దేవాలయాల్లో ప్రత్యేక దర్శనం పొందేందుకు అవకాశం ఉంది. తల్లిదండ్రుల సంరక్షణ పోషణ చట్టం 2007 కింద కుమారులు, కోడళ్లు పట్టించుకోకపోతే చర్యలకు కూడా ఈ కార్డులు ఉపయోగపడతాయి.

ట్రాన్స్ జెండర్లకు అందిస్తున్న సదుపాయాలు?

ట్రాన్స్‌జెండర్లుకు గుర్తింపు కార్డులు ఇస్తున్నాం. వీరికి డిఆర్‌డిఎ ద్వారా సామాజిక పింఛన్లు ఇస్తున్నారు. నైపుణ్య కార్పొరేషన్ ద్వారా వివిధ చేతి వృత్తుల్లో శిక్షణిప్పిస్తున్నాం.

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

రాజకీయ పరిణామాల సభ కరపత్రం ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఫిరంగిపురం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు - ప్రస్తుత రాజకీయ పరిణామాలపై ఈనెల 25న గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించే సభను జయప్రదం చేయాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఇ.అప్పారావు, జిల్లా కమిటీ సభ్యులు బి.శ్రీనివాసరావు కోరారు. సభలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు మాట్లాడతారని తెలిపారు. ఈ మేరకు కరపత్రాన్ని మండల కేంద్రమైన ఫిరంగిపురంలో ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సమావేశానికి వెంగళ్‌రెడ్డి అధ్యక్షత వహించారు. అప్పారావు, శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక నిత్యావసర ధరల పెరుగుదలకు అంతేలేకుండా పోయిందన్నారు. ప్రజల జీవనం కష్టతరంగా మారిందని, మరోవైపు వ్యవసాయాన్నీ కార్పొరేట్లకు కట్టబెట్టడానికి కేంద్రం యత్నిస్తోందని విమర్శించారు. మణిపూర్ ఘటనలపై సుదీర్ఘ కాలం తర్వాత ప్రధాని మోడీ మొసలి కన్నీరు కార్చడం మినహా శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకున్న చర్యలేమీ లేవన్నారు. మణిపూర్ ఘటనలపై అక్కడి సిఎం సైతం బాధ్యతా రాహిత్యంగా మాట్లాడుతున్నారని, విమర్శించారు. బిజెపి పాలనలో మహిళలు, బాలికలపై దేశవ్యాప్తంగా లైంగిక దాడులు పెరిగాయని, నేరాలకు పాల్పడిన వారు స్వేచ్ఛగా తీరుగుతున్నారని మండిపడ్డారు. రాజ్యాంగానికి తూట్లు పొడిచేలా బిజెపి పాలన సాగుతోందని, ఈ నేపథ్యంలో ఈ విధానాలను తిప్పికొట్టాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ అంశాలపై వివరించేందుకు నిర్వహించే సభలో అందరూ పాల్గొనాలని కోరారు. సిపిఎం మండల కార్యదర్శి ఎస్.ఎం వలి, నాయకులు జి.వెంకటేశ్వరరావు, మురళికృష్ణ, పాల్గొన్నారు.